సహజీవన భావనల పావురాయి

# పావురాయి

వారపత్రిక 12-4-2024 15/-



# నిరుద్యోగసమస్య




రచయితలకు
పాఠకులకు
శ్రేయోభిలాషులకు
**ఈదుల్ ఫిత్ర్**
శుభాకాంక్షలు!

# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 15 హైదరాబాద్
శుక్రవారం 12 ఏప్రిల్ 2024 రూ.15-00
2 షవ్వాల్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

మనిషిపై దౌర్జన్యం జరిగితే అతను అల్లాహ్ కోసం సహనం వహించాలి. అందుకు బదులుగా అల్లాహ్ అతనికి ఎనలేని సహాయం చేస్తాడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


**చదువు "కొ"ంటున్న వ్యాపారం**

## లోపల...


| | | |
|---|---|---|
| మోడీ మాటలు | ...... | 04 |
| నిరుద్యోగ సమస్య | ...... | 05 |
| విచక్షణా ప్రమాణం-24 | ...... | 08 |
| చరితార్థులు-2 : మౌలానా ముహ్మూద్ హసన్ | ...... | 12 |
| సహనం – స్వర్గానికి, సాఫల్యానికి సోపానం | ...... | 14 |
| రూహ్ అఫ్జా | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| విరుద్ధ భాగాల పరస్పర సమరసం-2 | ...... | 20 |
| అందరికీ ఆహ్వానం.... | ...... | 22 |
| ఇద్దరు అమెరికన్ కవులు – ఎడ్గర్ అండ్ ఎడ్విన్ | ...... | 24 |
| పవిత్ర రమజాన్ తర్వాత మన జీవనం | ...... | 27 |
| ఇదేమి చోద్యం విశ్వగురూ? | ...... | 28 |
| ఇస్లాం యుగపురుషుడు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ | ...... | 29 |
| చీమ | ...... | 30 |
| మతతత్వానికి, మందిస్వామ్యానికి పెద్దపీట వేస్తున్న నేటి సినిమా | ...... | 32 |
| చరిత్ర సాక్షిగా మార్చి 31, ఓ విప్లవం | ...... | 34 |


**పరువుకోసం పాకులాట...**




అన్నట్లుగనే రేవంతు
తెరిచిండ ఏంది గేట్లు
బీఆర్ఎస్ పడవకు
పడ్తున్నయి తూట్లు!
ఏంచెయ్యాలో తెలీక
గులాబీ నేతల పాట్లు
పరువు పోకూడదని
చేస్తున్న రోయి ఫీట్లు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# మోడీ మాటలు

**సుప్రీంకోర్టు** ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించి నెలరోజులు గడిచిపోయిన తర్వాత ఈ విషయంలో ప్రధాని మోడీ తన మౌనాన్ని వదిలి మాట్లాడారు. ఈ ఎలక్టోరల్ బాండ్ల వల్లనే డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందన్నది తెలుస్తుందని, ఈ సమస్యను ప్రచారం చేసి డాన్సులు చేస్తున్న వారు తర్వాత బాధపడతారని అన్నారు. ఆయన చెప్పిన మాటలు గమనించ దగినవి. అవేమిటంటే –

2014కు ముందు ఎన్నికల్లో డబ్బు ఖర్చయ్యేది కదా అన్నారు. నిజమే ఖర్చయ్యేది కాదని ఎవరన్నారు. 2019లో అయితే ప్రపంచ రికార్డు స్థాయిలో ఖర్చు అయ్యిందన్నది కూడా నిజమే. ఎన్నికలప్పుడు రాజకీయ పార్టీలకు 2014 కన్నా ముందు లభించే నిధులు ఎవరిచ్చారనే రికార్డు, పారదర్శకత ఉండేదా అని ప్రధాని ప్రశ్నించారు. ఒక పార్టీకి డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది అనేది ఎవరైనా చెప్పగలిగేవారా? అని ప్రశ్నించారు. నేడు ఎలక్టోరల్ బాండ్ల వల్ల డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో తెలుస్తొందని అన్నారు. ఈ మాటలు వింటే చాలా విచిత్రంగా అనిపించడం లేదా? ఎలక్టోరల్ బాండ్లు తాము తీసుకురావడం వల్లనే ఎవరు నిధులు, విరాళాలిస్తున్నారనే వివరాలు ప్రజలకు తెలుస్తున్నాయని లేకపోతే తెలిసే అవకాశమే లేదని ఆయన చెప్పడం ఒక విచిత్రం. ఎందుకంటే, విరాళాలిచ్చిన వారి పేర్లు రహస్యంగా ఉంచడానికి బీజేపీ సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేసింది. అసలు రాజకీయ పార్టీలకు ఎవరు నిధులు ఇస్తున్నారు? ఎవరు విరాళాలిస్తున్నా రనేది తెలుసుకునే హక్కు, అధికారాలు ప్రజలకు లేవని కూడా ప్రభుత్వ న్యాయవాది కోర్టులో వాదించారు. కాని సుప్రీంకోర్టు ససేమిరా కుదరదని చెప్పి ఆ వివరాలు చెప్పాలని నిలదీసిన తర్వాత కూడా జులై వరకు టైము కావాలని స్టేట్ బ్యాంకు కోరింది. కంప్యూటర్‌లో ఉన్న వివరాలు చెప్పడానికి ఇన్ని నెలలు ఎందుకు అవసరం? లోక్‌సభ ఎన్నికల వరకు ఈ వివరాలు దాచి పెట్టాలన్నది అసలు ఉద్దేశ్యం. కాని సుప్రీంకోర్టు మరోసారి కుదరదని ఖరాఖండిగా చెప్పిన తర్వాత మాత్రమే ఈ వివరాలు బయటకు వచ్చాయి. డబ్బులు ఎవరిచ్చారన్నది ఎవరికీ తెలియ కుండా దాచిపెట్టడానికి ఇంత ప్రయత్నించిన తర్వాత ఇప్పుడు తాము తీసుకువచ్చిన ఎలక్టోరల్ బాండ్ల వల్లనే పారదర్శకత సాధ్యమయ్యిందని చెప్పడం మోడీ గారికే చెల్లు.

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా డబ్బులు ఇచ్చిన వారు మరో ప్రయో జనం పొంది ఉంటారు. ఇదే కదా అవినీతి. ఈ విషయాన్ని కోర్టు కూడా చెప్పింది. మొత్తం 12,008 కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లలో 55 శాతం బీజేపీకే లభించాయి. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీకి 93 శాతం ఎలక్టోరల్ బాండ్లు లభించాయని కూడా తెలుస్తోంది. తమ ప్రభుత్వంపై అవినీతి మరకల్లేవని మోడీ చెబుతుంటారు. కాని ఇప్పుడు ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం అతిపెద్ద అవినీతి మరకలా మారింది. ఎన్నికల వ్యవస్థలో బ్లాక్ మనీ తొలగించడానికి ఈ స్కీము తెచ్చామని అప్పట్లో బీజేపీ అగ్రనేత అరుణ్ జైట్లీ చెప్పారు. కాని ఇప్పుడు దాతల లిస్టు చూస్తే ఊరు పేరు లేని కంపెనీలు తమ నెట్ ప్రాఫిట్ కన్నా వంద రెట్లు అధికమొత్తం బాండ్ల రూపంలో ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ కంపెనీలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? మనీ లాండరింగ్ జరగడం లేదా? ఇంత పెద్ద మొత్తంలో రాజకీయ విరాళం ఇచ్చిన వాళ్ళు బదులుగా ఏమాశించి ఉంటారు? ఈడీ, ఇంకం టాక్స్, సిబిఐ సంస్థల దాడుల తర్వాత కొన్ని కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లను కొన్న వార్తలు కూడా వచ్చాయి. కాంగ్రెసు ఆరోపిస్తున్నట్లు వసూళ్ళ రాజకీయం బాండ్ల రూపంలో నడిపారా? ఎలక్టోరల్ బాండ్లకు తోడు ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా వచ్చే రాజకీయ విరాళాలు కూడా చాలా పెద్ద వాటా బీజేపీకే లభించాయి. ఎలక్టోరల్ బాండ్లకు ముందు కంపెనీ గత మూడు సంవత్సరాల సగటు లాభాల్లో కేవలం 7.5 శాతం కన్నా తక్కువ మాత్రమే రాజకీయ విరాళంగా ఇచ్చే పరిమితి ఉండేది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆ పరిమితిని పక్కనపెట్టేశారు. నెట్ ప్రాఫిట్ కన్నా వంద రెట్లు ఎక్కువ ఇచ్చినా అడిగే పరిస్థితి లేని వాతావరణం తీసుకువచ్చారు. ఇదంతా అవినీతి కాక మరేమిటి?

ఇప్పుడు అవినీతి మరకలు బీజేపీపైనే ఎక్కువగా కనబడుతు న్నాయి. అవినీతి నేతలుగా పేరుమోసిన వారిని పార్టీ ఎర్రతివాచీ పరిచి ఆహ్వానించింది. అజిత్ పవార్, అశోక్ చవాన్, నవీన్ జిందాల్, గీతా కొడా ఈ జాబితా చాలా పెద్దదే. పార్టీ మార్చి బీజేపీలోకి వచ్చిన తర్వాత వారిపై కేసులు లేవు. అందుకే ప్రతిపక్షాలు బీజేపీని వాషింగ్ మెషిన్ అంటున్నాయి. అవినీతి మరకలను కడిగేసే వాషింగ్ మెషిన్ బీజేపీ అని, బీజేపీలో చేరితే ఆరోపణలు కేసులు ఉండవని, చేరకపోతే కేసులు జైళ్ళు తప్పవన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ఎన్నికలు ప్రజలకు ఒక గొప్ప అవకాశాన్నిస్తున్నాయి. ప్రజాస్వామిక విలువలను పాతరేసిన వారికి గుణపాఠం చెప్పే ఈ అవకాశాన్ని ప్రజలు వాడు కుంటారా? ❑

అబ్దుల్ వాహెద్



# నిరుద్యోగ సమస్య

**ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్** రిపోర్టు ఇటీవల వచ్చింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్మెంట్ సహకారంతో ఈ నివేదికను రూపొందించారు. ఈ నివేదిక దేశంలో నిరుద్యోగ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చాటి చెప్పింది.

భారతదేశంలో ఉద్యోగాల నివేదిక లేదా "ఇండియా ఎంప్లాయ్ మెంట్ రిపోర్ట్ 2024 : యూత్ ఎంప్లాయ్ మెంట్, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్" నివేదికలో యువతరం ఎదుర్కుంటున్న సమస్యలను ప్రస్తావించింది.

ఈ నివేదిక ప్రకారం దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం మంది యువకులే. మొత్తం నిరుద్యోగ యువకుల్లో చదువుకున్న వాళ్ళు అంటే సెకండరీ స్కూలు స్థాయి విద్య, ఉన్నత చదువుల స్థాయి విద్య పొందిన వారు 2022లో 65.7 శాతం ఉన్నారు. అంతకుముందు 2000లో కేవలం 35.2 శాతం ఉండేవారు.

అంటే చదువుకున్న యువతలో నిరుద్యోగం చాలా పెరిగి పోతోంది. 2000 సంవత్సరం నుంచి 2019 సంవత్సరం మధ్యకాలంలో నిరుద్యోగ సమస్య అనేకరెట్లు పెరిగింది. అనేక సూచికలు పతనమయ్యాయి. లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు, వర్క్ పాప్యులేషన్ రేషియో, అన్ ఎంప్లాయ్మెంట్ రేటు వంటి సూచికలు దిగజారాయి. 2019 తర్వాత ఆర్థిక సంక్షోభ పరిస్థితులు కూడా తలెత్తాయి. పైగా కోవిడ్ రెండు అలలు కూడా పరిస్థితిని దిగజార్చాయి. 2014 తర్వాత అంటే నరేంద్రమోడీ ప్రధానిగా బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగం మరింత పెరిగిందన్నది ఈ నివేదిక స్పష్టంగా చెబుతోంది.

ఈ నివేదికను పరిశీలిస్తే దేశంలోని యువతలో అవసరమైన నైపుణ్యాలు లోపించడం కూడా తెలుస్తోంది. ఉద్యోగాలు సంపాదించుకునే నైపుణ్యాల కొరత ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది.

ఎటాచ్‌మెంటుతో ఈ మెయిల్ పంపించడం వంటి మౌలిక విషయాలు కూడా తెలియని వారు 75శాతం ఉన్నారు. ఎక్సెల్ వంటి కంప్యూటర్ అప్లికేషన్లలో మౌలికమైన స్థాయి జ్ఞానం కూడా లేనివారు 90 శాతం ఉన్నారు. చదువుకున్నవారిలో ఈ నైపుణ్యాలు లేకపోవడం కూడా గమనించదగిన విషయం.

దేశంలోని లేబర్ మార్కెటులో స్త్రీ పురుష వివక్ష కూడా కనిపిస్తోంది. మహిళలు చాలా తక్కువ మంది ఉద్యోగాల్లో ఉన్నారు. మరోవైపు షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ప్రజలకు నాణ్యమైన విద్యావకాశాలు లభించడం లేదు. చాలా మంది అసంఘటిత రంగంలో పనులు చేసుకుంటున్నారు. వారికి ఉద్యోగ భద్రత లేదా ఉపాధి భద్రత వంటివి లేనే లేవు.

ఈ నివేదికను విడుదల చేస్తూ ప్రధాన ఆర్థిక సలహాదారుడు వి. అనంత నాగేశ్వరన్ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం నేటి తక్షణ అవసరమని చెప్పారు. మోడీ ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్కిల్ ఇండియా వగైరా మాటలు ఎన్ని చెబుతున్నప్పటికీ ఈ మాటలన్నీ కాగితాలపై కనబడడం వేదికలపై వినబడడం తప్ప ఆచరణలో, అమలులో సాధించింది ఏదీ లేదని స్పష్టమవుతోంది.

ఇంతకు ముందు అనేక నివేదికలను నిరాకరించిన మాదిరిగానే ఈ నివేదికను కూడా మోడీ ప్రభుత్వంలోని మంత్రి అనురాగ్ ఠాకూర్ నిరాకరించేశారు. ప్రభుత్వ విధానాల వల్ల చాలా ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. కాని వాస్తవాలు అందరి ముందు ఉన్నాయి.

ఛత్తీస్‌గఢ్ ఎన్నికలప్పుడు ప్రధాని దేశంలో 80 కోట్ల మందికి ఉచిత ఆహారధాన్యాల పంపిణీ పథకాన్ని ప్రకటించారు. నిరుపేదలకు ఉచితంగా ఆహారధాన్యాలు అందించే పథకం. కోవిడ్ కాలంలో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని మరో ఐదేళ్ళు పొడిగిస్తామన్నారు. ఇది మోడీ ఇస్తున్న గ్యారంటీ అన్నారు. దేశప్రజల్లో అధికశాతం మందికి ఉచిత ఆహారధాన్యాల పథకం అవసరమెందుకు వచ్చింది? అనేది ఆలోచించవలసిన ప్రశ్న. భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారిపోతుందని చెప్పుకుంటున్నప్పుడు, శరవేగంగా దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని ప్రచారం చేసుకుంటున్నప్పుడు, ఇలాంటి ఆర్థికవ్యవస్థ కలిగిన దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఎందుకు అవసరమయ్యిందనేది సీరియస్‌గా ఆలోచించవలసిన ప్రశ్న. ఆలోచించవలసిన మరో ముఖ్యమైన ప్రశ్న ఏమంటే ప్రపంచ ఆకలి సూచిలో భారతదేశం ఎందుకు పతనమవుతోంది. 125 దేశాల్లో మన స్థానం 111. ఈ నివేదికపై బీజేపీ నేతలు ఎన్ని విమర్శలు చేసినా, దేశంలో 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందించవలసిన పరిస్థితి ఉందంటే ఈ నివేదికలో నిజాలున్నాయో లేదో అర్థమవుతోంది.

దేశంలో యువతకు స్థిరమైన ఉద్యోగం ఉండడం దేశ ఆర్థిక ప్రగతికి చాలా అవసరం. చాలా మంది స్థిరమైన ఆదాయాన్నిచ్చే ఉద్యోగాలే కోరుకుంటారు. వ్యాపారాల్లో ప్రయోగాలు చేసి విజయాలు సాధించే తెలివి, అదృష్టాలు తక్కువమందికి ఉంటాయి.

దేశంలో చాలా మంది అసంఘటిత రంగంలోనే ఉపాధి అవకాశాలు కలిగి ఉన్నారు. దాదాపు 90 శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. అలాగే స్వయం ఉపాధి పొందినవారు 55.8 శాతం ఉన్నారు. స్వయం ఉపాధి కోసం ప్రయత్నిస్తున్న వారి ఆదాయం కూడా అంతంత మాత్రంగానే ఉంది. కాజువల్ లేబర్లలో దాదాపు 60 శాతం మందికి కనీస వేతనాలు లభించడం లేదు. మరోవైపు స్వయం ఉపాధి పేరుతో లేదా కుటుంబ ఉపాధి కార్యకలాపాల్లో పాల్గొంటున్న మహిళలకు ఎలాంటి వేతనాలు లభించడం లేదు. వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం వల్ల గ్రామీణ యువత మళ్ళీ వ్యవసాయ ఉపాధి కార్యకలాపాల వైపు మరలడంతో అక్కడ పోటీ పెరిగి వేతనాలు పడిపోతున్నాయి. దేశంలోని ఉత్పాదకరంగం, సేవారంగాల్లో ఉపాధి అవకాశాలు చాలా పడిపోయాయి.

కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమైంది. ఉపాధి కల్పన కోసం ప్రయత్నించడం ప్రభుత్వాల బాధ్యత. కాని ఈ నివేదికను విడుదల చేస్తూ ఆర్థిక సలహాదారుడు ఏమన్నారంటే, ఉపాధి అవకాశాల కోసం కేవలం ప్రభుత్వమే ఏదో చేయాలని ఆశించరాదన్నారు. అంటే ఏమిటి, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం పని కాదా? యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేకపోతే అనేక కుటుంబాల క్రయశక్తి బలహీన పడుతుంది. ఫలితం మార్కెటులో మాంద్యం ఏర్పడుతుంది. ఆర్థికవ్యవస్థ కుదేలవుతుంది. కాబట్టి దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలంటే ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వానికి ఎంతైనా అవసరం. ఒకవైపు కృత్రిమ మేధస్సు రంగంలో వస్తున్న ఆవిష్కరణల వల్ల అనేక ఉద్యోగాలపై కత్తి వేలాడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రయత్నించవలసిన మోడీ ప్రభుత్వం అలాంటి ప్రయత్నాలేవీ చేస్తున్నట్లు కనబడడం లేదు.

ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన ఒక ట్వీట్ బీజేపీ శిబిరంలో కలవరానికి కారణమయ్యింది. నిజానికి దీని గురించి పెద్దగా జాతీయ మీడియాలో చర్చ జరగనే లేదు. రాత్రి 9 గంటలకు జరిగే టీవీ చర్చా కార్యక్రమాల్లో మోడీ సమర్థించడమే నా పని అంటూ బాహాటంగా చెప్పుకునే యాంకర్లు ఇలాంటి వార్తలను ప్రజలకు తెలియజేయడం చేయనే చేయరు. ప్రధాని మోడీ ఏ చిన్న ప్రకటన చేసినా, ఏ చిన్న మాట చెప్పినా ఈ జాతీయ మీడియా చానళ్ళకు మాస్టర్ స్ట్రోక్. ఆ రోజంతా అదే వార్త నడుపుతుంటారు. కాని రాహుల్ గాంధీ ఉపాధి అవకాశాల గ్యారంటీ గురించి చెప్పిన మాట అస్సలు ఈ చానళ్ళకు కనిపించనే లేదు.

రాహుల్ గాంధీ ఇటీవల ఒక ప్రసంగంలో స్పష్టంగా నిరుద్యోగ సమస్య గురించి ప్రస్తావించారు. నలభై సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం ఇప్పుడు పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మాటలో వాస్తవం కూడా ఉంది. ఒకవైపు ప్రభుత్వ రంగం సంస్థలను అమ్మేయడం జరుగుతోంది. ప్రయివేటైజేషన్ వల్ల ఉద్యోగాలు పోతున్నాయి. కోవిడ్ వల్ల ఉద్యోగాలు పోయాయి. చదువుకునే విద్యార్థులు పరీక్షా పత్రాల లీకుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, నియామకాల కుంభకోణాలు ముందుకు వచ్చాయి. చివరకు మిలిటరీలో, సైన్యంలో నియామకాల విషయంలో కూడా అగ్నివీర్ తీసుకువచ్చి ఆ ఆశలపై కూడా చన్నీళ్ళు కుమ్మరించారు. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగ సమస్య పరిష్కారం గురించి రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ చేసిన ఒక ట్వీట్ కూడా గమనించదగింది. ఆ ట్వీటులో ఆయన యువతను ఉద్దేశించి, ఏడాదికి కనీసం లక్షరూపాయల వేతనం లభించే మొదటి ఉద్యోగం మీకు తప్పక దొరుకుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రూపొందించిన కొత్త పథకం ద్వారా నిరుద్యోగ సమస్యను నిర్మూలిస్తామని చెప్పారు.

కాంగ్రెసు పార్టీ రైట్ టు అప్రెంటిస్ చట్టం తీసుకువచ్చి పాతికేళ్ళ కన్నా తక్కువ వయసున్న పట్టభద్రులకు ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగంలో సంవత్సరం పాటు పెయిడ్ అప్రెంటిస్ షిప్ అవకాశం కల్పిస్తామన్నారు. ఇది ఒక గొప్ప ఆలోచనగానే చెప్పాలి. సాధారణంగా అప్రెంటిస్ షిప్ పేరుతో పనిచేయించుకుని పైసా ఇవ్వకుండా ఎగ్గొట్టేవాళ్ళే ఎక్కువ. ఈ చట్టం వచ్చి యువతకు సంవత్సరం పాటు అప్రెంటిస్ షిప్ ద్వారా మొదటి ఉద్యోగం, ఉద్యోగానుభవం లభిస్తుంది. ఒక ఏడాది అనుభవం తర్వాత అదే ఉద్యోగంలో కొనసాగే అవకాశాలు లేదా కొత్త ఉద్యోగం సంపాదించుకునే అవకాశాలు మెరుగవుతాయి. ముఖ్యంగా ఏడాది పాటు అప్రెంటిస్ షిప్ ద్వారా కనీస నైపుణ్యాలు సంపాదించుకోగలరు. నిరుద్యోగ నివేదికలో కనీస నైపుణ్యాల కొరత గురించి ప్రస్తావించిన విషయాలను గమనిస్తే ఈ అప్రెంటిస్ షిప్ అవకాశం ఎంత కీలకమైనదో అర్థమవుతుంది.

రాహుల్ గాంధీ ట్వీటులో చెప్పింది కూడా ఇదే. దీనివల్ల జాబ్ మార్కెటులో ఉన్న అవకాశాలు, నిరుద్యోగుల్లో ఉన్న నైపుణ్యాల కొరత సమస్యను పరిష్కరిస్తుంది. స్కిల్ గ్యాప్ తొలగిస్తుంది. ఇది కేవలం ఒక ఏడాది మాత్రమే ఉండే అప్రెంటిస్ షిప్ కాదు. హ్యాండ్సాన్ ఎక్స్ పీరియన్స్ అనేది ప్రతి ఉద్యోగానికి మొదటిమెట్టు. అలాంటి మొదటిమెట్టుపై నిలబెట్టే ప్రయత్నం ఇది. నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు ఎలా లభిస్తాయో రోడ్ మ్యాప్ చూపించిన ఈ ట్వీటును మన మీడియా పట్టించుకోనే లేదు. నిజానికి నిరుద్యోగ నివేదికను కూడా మన మీడియా పట్టించుకోనే లేదు. బీజేపీ నేతలకు మాత్రం రాహుల్ గాంధీ ట్వీటు చూడగానే కాస్త కలవరం మొదలైంది. ఈ మాటలు ప్రజల్లోకి వెళితే రాహుల్ గాంధీ ప్రజాదరణ పెరుగుతుందేమో అన్న భయం కూడా పట్టుకుంది. రెండు కోట్ల ఉద్యోగాలిస్తామనే చునావీ జుమ్లాలు చెప్పిన వాళ్ళు, పదేళ్ళుగా హామీలు నిలబెట్టుకోలేని వాళ్ళు ఇలాంటి ట్వీట్లు చూసి కంగారు పడడం సహజమే.

రాహుల్ గాంధీ మరో ట్వీటు చేశారు. కాంగ్రెసు ఐదు గ్యారంటీలు ఇస్తుందని చెప్పారు. 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, మొదటి ఉద్యోగం గ్యారంటీగా అప్రెంటిస్ షిప్ చట్టం తెస్తామని, పరీక్షల్లో పేపర్లు లీకు అయ్యే పరిస్థితి మార్చేస్తామని, యువతకు స్టార్టప్ ఫండ్స్ ఇచ్చి వారి ప్రగతికి బాటలు వేస్తామని చెప్పారు. ఈ మొత్తం ట్వీటుల్లో ముఖ్యమైన అంశం నిరుద్యోగాన్ని తొలగిస్తామని చెప్పడం. ఇది చాలా ముఖ్యమైన విషయం కాని జాతీయ మీడియాగా చెప్పుకునే, గోదీ మీడియాగా పేరుమోసిన చానళ్ళేవీ దీని గురించి మాట్లాడడం లేదు.

ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి మళ్ళీ మందిరం గురించి మాట్లాడడం, హిందూ ముస్లిం రాజకీయాలు చేయడం, విద్వేష ప్రచారం ఇవన్నీ మామూలుగా జరిపిస్తూ మరోసారి గెలిచేయగలమని భావిస్తున్నారు. కాని అసలు సమస్యలు నిరుద్యోగం, అధికధరలను ఎన్నికల సమస్యలుగా మార్చడానికి ప్రజలు పూనుకోకపోతే దేశప్రగతి, ఆర్థిక ప్రగతి దెబ్బతింటాయి. ఈ పరిస్థితిని ప్రజలే ఓటు అనే ఆయుధంతో మార్చాలి. ❑

అధ్యాయం -8

24

# విచక్షణా ప్రమాణం

**ఎస్.ఎమ్. మలిక్**

## ఉమర్(ర) కాలం - సింహావలోకనం

పదేళ్ల అత్యల్ప కాలంలో మహనీయ ఉమర్ ఫారూక్ పాలనా పరిధి చూస్తూ చూస్తూ దాదాపు 23 లక్షల చదరపు మైళ్ల వరకు విస్తరించింది. ఈ సువిశాల భూభాగంలో ఇరాక్, సిరియా, ఈరాన్, బెలూచిస్తాన్‌లోని మక్రాన్, ఈజిప్టు, ఆర్మే నియా, జోర్డాన్, ఖురాసాన్, ఆజర్ బైజాన్, కర్మాన్ తదితర రాజ్యాలు ఉండేవి. ఇవి ప్రత్యేకంగా మహనీయ ఉమర్ కాలంలో జయించిన రాజ్యాలు. ఆయన ఇదంతా విస్తీర్ణ కాంక్షతో సాధించిన విజయాలు కావు. ఆయా దేశాల పాల కులు తమ దేశంలో ధర్మ ప్రచారానికి అవకాశం ఇచ్చి ఉన్నట్లయితే ఈ పోరాటాలు జరిగేవి కావు.

ఈరాన్, రోమా పాలకులు మాటిమాటికీ తలెత్తి ముస్లిముల అతిస్వల్ప శక్తిని ఢీకొని అవమానకరమైన రీతిలో చిత్తు చిత్తుగా ఓడిపోయేవారు. మళ్లీ లేచి మరో ప్రయత్నం చేసి మళ్లీ మానవ సంహారానికి పాల్పడేవారు. ఈ రక్త పాతానికి మహనీయ ఉమర్ (ర) ఎంతో బాధపడేవారు. ముస్లిములు, సృష్టికర్త, పాలకుడయిన, దేవుని ఏకత్వం, సర్వ మానవ సమానత్వం సిద్ధాంతం ప్రచారానికి పూనుకుని ఓ ఉద్యమంగా, ఏ విధంగానయినా ఈ సిద్ధాంతాల ప్రాచుర్యం చేయాలని బయలుదేరిన వారిని ప్రపంచం, చరిత్ర యుద్ధ పిపాసులుగా చిత్రించింది. ముస్లిమ్ యోధులు దైవ ధర్మ సంస్థాపనార్థం ఎన్ని దేశాలు పర్యటించినా వారి ఆధ్వర్యంలో యుద్ధం కోరిన వారితో తప్ప, ఇతరుల పట్ల ఎన్నడూ అన్యాయంగా, అధర్మంగా, దౌర్జన్యంగా రక్తం చిందించడం జరగ లేదు.

## ఇస్లామీయ ప్రజాస్వామ్యం

మహనీయ ఉమర్(ర) పరిపాలనా వ్యవహారాలను సదా సలహా సంప్రతింపుల ద్వారానే నిర్వహించేవారు. ఆ కార ణంగా సహచర మాన్యులను నిత్యం రాజధాని మదీనాలోనే తప్ప మరో చోట నివసించనిచ్చేవారు కారు. ఏదయినా పెద్ద కార్యక్రమం ఆసన్నమయినప్పుడు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి అందులో వ్యవహారం ముందుంచేవారు. అతి సాధారణ వ్యక్తి అయినా సమంజస అభిప్రాయం వ్యక్తం చేస్తే దాన్ని ప్రముఖ నాయకుల అభిప్రాయాని కన్నా, కొన్ని సందర్భాల్లో తన అభిప్రాయానికన్నా ప్రాధాన్యత నిచ్చే వారు.

ఓ సందర్భంలో ఆయన, ''ఈ రోజుల్లో మహ్ర్ (స్త్రీ ధనం) క్రమేణా బాగా పెరిగిపోతోంది, నేను దానికి ఓ హద్దు అంటూ నిర్ణయించాలని అనుకుంటున్నాను'' అని పలికారు. సమా వేశంలో మహిళా విభాగం నుంచి ఓ కంఠం వినిపించింది, ''దైవమయితే 'మీలో ఎవరయినా తమ భార్యలకు ఎంత అధిక ధనం ఇచ్చి ఉన్నా దాన్ని తిరిగి వెనక్కి తీసుకోరాదు'

అని అంటున్నాడు." అది వినగానే ఆయన, "అవును, సోదరి పలికిందే సరయినది, నేనే తప్పుగా ఆలోచించాను" అని సవరించుకున్నారు.

ఆయన తన ప్రసంగాలలోనూ, వ్యక్తిగత సంభాషణల్లోనూ తరచుగా "సముదాయం కొరకు శ్రేయస్కరం అని తోచిన ప్రతి విషయాన్ని నాకు తెలుపండి. నేనేదయినా తప్పు చేస్తే నాకు సరయిన దారి చూపండి, నేను సన్మార్గాన్ని అనుసరిస్తున్నంత వరకు నాకు తోడ్పడండి" అనేవారు. ఒకసారి మస్జిద్‌లో ఇలాగే ప్రసంగించారు. వెంటనే ఓ వ్యక్తి లేచి ఒరలోని కరవాలం లాగి, "మీరు సత్యానికీ విముఖత కనబరిస్తే మేము దీని ద్వారా మిమ్మల్ని సన్మార్గాన తీసుకు వస్తాము" అన్నాడు. ఇది విని ఆయన ఎంతో సంతోషంగా, "నాకు ఇక తృప్తిగా ఉంది, దైవకృప వల్ల నా జాతిలో నా పైన దృష్టి పెడుతున్న వారున్నారు, నేను దారి తప్పితే చక్కదిద్దడానికి సిద్ధంగా ఉన్నారు" అన్నారు.

ఒకసారి ఓ వ్యక్తి ఆయన్ని సంబోధించి మాటిమాటికీ, "ఉమర్! దైవానికి భయపడు" అన సాగాడు. మరో వ్యక్తి అతన్ని ఆపి, "ఇక చాలించు, ఎన్ని సార్లు చెబుతావు?" అని గద్దించాడు. ఆయన అది విని, "అతన్ని ఆపకు, చెప్పనివ్వు, జనం అవసరం కలిగినప్పుడు చెప్పకపోతే ప్రయోజనం లేదు. అలాగే మేము అంగీకరించకపోతే మేముండి నిష్ప్రయోజనం" అన్నారు.

## ఆయన న్యాయ విధానం

మహనీయ ఉమర్(ర) ప్రకారం, న్యాయం ధర్మం అన్నవి ఆయన పాలనలో దేశంలో మూల మూలలో, జాప్యం లేకుండా, సమయానికి, భవంతుల్లోనూ, పూరిగుడిసెల్లోనూ చేరాలి. గవర్నర్ అయినా, అనామక పౌరుడయినా ఉభయులకూ సమాన స్థాయి లభించాలి. ఇది కేవలం సైద్ధాంతికంగా మాత్రమే ఉండిపోలేదు, ఆయన దాన్ని పూర్తి స్థాయిలో ఏ మాత్రం తప్పకుండా అమలు పరిచారు. అతి సాధారణ వ్యక్తి కూడా ఓ గవర్నర్ లేదా ఓ ఉన్నతాధికారి ఎడల ఏదయినా కంప్లయింట్ చేస్తే ఆయన న్యాయ విధానం ప్రకారం ఇద్దరూ సమానంగా నిలబడ వలసిందే. విచారణ తరువాత అతను అపరాధిగా తేలినట్లయితే శిక్షను తప్పించుకోలేడు.

ఒక రోజు ఆయన ఓ ప్రసంగంలో, "పరిపాలనాధికారులు బాగా విని అర్థం చేసుకోవాలి, నా వద్దకు ఏ అధికారిని గురించి ఎటువంటి ఆరోపణ వచ్చినా విచారణ జరిపి న్యాయం చేయడం జరుగుతుంది. శిక్షను తప్పించుకునే మార్గం ఏదీ లేదు" అన్నారు. సిరియా, ఈజిప్టు రాజ్యాలను జయించిన మహనీయ అమ్ర్ బిన్ ఆస్, అప్పుడు ఈజిప్టు గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వారు అడిగారు, "ఓ అధికారి ఎవరినయినా సుశిక్షణ గరపడానికి శిక్షించినా దానికీ విచారణ జరుపుతారా?" అని. "అవును, దానికీ షరీఅత్‌లో శిక్షలు నిర్ణయమయి ఉన్నాయి. న్యాయ విచారణ జరిపి వాటిని అమలు పరచడం జరుగుతుంది. అంతే" అని బదులిచ్చారు.

## అధికారుల పట్ల ఫిర్యాదు

ఒక సారి ఖలీఫా వద్దకు మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్, కాదిసియ, మదాయన్ దేశాల విజేతపై ఆరోపణ చేరింది. ఆ కాలంలో ఈరానీయులు దాదాపు లక్షన్నర మంది సైనికుల్ని ఓచోట మోహరించారు. అప్పుడు కూడా ఆయన చెప్పారు, "దీని విచారణకు సమయం సున్నితం, పరిస్థితులు అతి భయంకరంగా ఉన్నాయి. అయినా న్యాయంలో జాప్యం జరగదు" అని. ఆయన వెంటనే ఓ అధికారిని కూఫా, మహనీయ సఅద్ ఉన్న నగరానికి పంపారు. అక్కడ ఆయన ప్రతి మస్జిద్‌లో విచారించారు, తరువాత మహనీయ సఅద్‌ని తోడుగా తీసుకుని రాజధానికి వచ్చారు. విచారణలో మహనీయ సఅద్ నిర్దోషిగా తేలారు.

అప్పుడు మహనీయ ఉమర్, "అయ్యా! నేను కూడా ఇంతే అవుతుందని అనుకున్నాను, అయినా న్యాయావశ్యకత తీరిపోయింది" అని తృప్తిగా అన్నారు. ఆ పైన అబద్ధ ఆరోపణలు మోపిన వారిని అదుపులోకి తీసుకోవడం జరిగింది.

ఒకసారి ఆయన ఎటో వెళ్ళుతున్నప్పుడు ఓ మాట విన్నారు, ఈజిప్టు కలెక్టర్ అయాజ్ విలువయిన సన్న బట్ట చొక్కా తొడుగుతారని, ఆయన ద్వారం వద్ద కాపలాదారు ఉంటాడనీను. ఆయన వెంటనే వెను తిరిగి వచ్చి ఓ అధికారిని ఈజిప్టుకు వెళ్లి అయాజ్‌ని ఉన్న స్థితిలో తన వెంట తీసుకుని రమ్మని ఆదేశించారు. ఆ అధికారి ఆయన ద్వారం వద్ద కాపలాదారు ఉన్న నిజం చూశారు. అయాజ్ సన్నని బట్ట చొక్కా (సాధారణ జనులకు లభ్యం కానిది) తొడిగి ఉన్నారు. ఆయన ఖలీఫా వద్దకు వచ్చినప్పుడు ఖలీఫా ఆయన చొక్కా తీయించి సాధారణ చొక్కా తొడిగించారు. ఆ తరువాత ఓ గొర్రెల మంద తెప్పించి ఎడారిలో రోజూ మేపుకు రావాలని పురమాయించారు.

మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (ర) కూఫా నగరంలో తాను నివసించడానికి ఓ ఇల్లు కట్టుకున్నారు. దాని ద్వారం ఒక దానికి అంటుకుని మరొకటి రెండుగా ఉండేది. అది మహనీయ ఉమర్‌కు తెలియగానే, "ఇటువంటి ద్వారం వల్ల ఫిర్యాదు చేసుకునే వారికి ఆటంకం కలుగుతుంది" అని చెప్పి దాన్ని మార్పించారు.

మహనీయ అమ్మార్ బిన్ యాసిర్(ర) కూఫా నగర పాలనాధి కారి. ఆయనకు పరిపాలనా విధానం తెలియదని, నాయకత్వ లక్షణాలు అసలే లేవని తెలిసింది. ఆయన్ని పిలిచి పరీక్షగా కొన్ని ప్రశ్నలు అడిగారు, తనకు తెలిసిన విషయం సరయినదే అని గ్రహించి ఆయన్ని ఆ బాధ్యత నుంచి తొలగించారు.

మహనీయ ఉమర్ (ర) ఎన్నెన్నో సరికొత్త కట్టడాలు నిర్మిం చారు. అయితే న్యాయస్థానాలకు వేరే కట్టడాలు నిర్మించ లేదు. మస్జిదుల్లోనే న్యాయ విచారణ జరిపించాలని ఆదేశిం చారు. కాజీ(న్యాయమూర్తు)లకు, న్యాయస్థానం వాతావర ణాన్ని, దాని ఉద్యోగుల నైతిక స్వభావాన్ని ఉత్తమంగా, పీడితులకు, అర్హులయిన వారికి, ఇక్కడ సరయిన న్యాయం లభిస్తుందన్న నమ్మకం కలిగేలా ఏర్పరచాలని నిర్దేశాలు జారీ చేశారు. ఇంకా కాజీల నియామకానికి ముందు వారి బుద్ధికుశలత, జ్ఞాన సంపద, వివేచనాశక్తి తదితర అంశాలను పరీక్షించి మరీ నియమించడం జరిగేది.

## వ్యక్తిగత జీవితం, సామర్థ్యాలు

చరిత్రకారులు మహనీయ ఉమర్(ర) తన ఖిలాఫత్ కాలంలో తీసుకునే వేతనం గురించి కూడా పరిశోధించి తెలిపారు. ఆయన తన కుటుంబ అవసరాల కొరకు అతి తక్కువ వేతనం గ్రహించేవారు. అందువల్ల వేసవిలో తీసు కున్న బట్టల్ని బాగా పాతబడి నలిగిపోయే వరకు ధరించేవారు. రుతువు మారినప్పుడు ఎంతో కష్టం కలిగేది. జౌ(బార్లి ధాన్యం) రొట్టె, జైతూన్ (ఆలివ్) నూనె కూర, ఆయన ఆహారంగా తీసుకునేవారు.

మహనీయులు ఉస్మాన్, జుబైర్ (రజియల్లాహు అన్హుమా) ఇది చూసి ఎంతో బాధపడ్డారు. వారు (ప్రవక్త సతీమణి) ఆయన కూతురు, మహనీయ హఫ్సా(ర) వద్దకు వెళ్లి తమ పేర్లు చెప్ప వద్దని, ఆయన తీసుకునే వేతనం కనీసావసరా లకూ సరిపోదని, దాన్ని కొంతయినా పెంచాలని చెప్పమని కోరారు. ఆమె వెళ్లి ఆయనకు చెప్పగా ఆయన, "నీకు దీనికి ప్రేరేపించిన వారెవరు, నేను వారి పని పడతాన"ని గద్దిం చారు. మహనీయ హఫ్సా, వారి పేర్లు చెప్పనని నేను వాగ్దానం చేశాను అన్నారు. దానికి, "అలాగా, నీవు నాకూ వారికీ మధ్య వర్తివా, అయితే చెప్పు, ప్రవక్త మహనీయులు(స) పస్తులుండ లేదా? అతుకుల బట్టలు తొడగలేదా? ఆయన(స) అలా ప్రపంచం పట్ల శ్రద్ధ వహించనప్పుడు, నాకు ఈ సలహాలు ఇవ్వడం దేనికీ?" అని ఆగ్రహించారు.

ఖిలాఫత్ బాధ్యతల పట్ల ఆయన ఎంతో జాగరూకులయి వ్యవహరించే వారు. "ఫరాత్ నది ఒడ్డున ఓ ఒంటె తప్పి పోయినా నాకు దైవం సమక్షంలో జవాబు చెప్పుకోవలసి ఉంటుందని నేను భయపడుతూ ఉంటాను" అని పలు మార్లు పలికారు. ఆయన మదీనా పొలిమేరలోని ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ అక్కడ మకాం వేసిన బిడారాల అవసరాలను తీర్చేందుకు, రాత్రిళ్ళు వాటి కాపలాకు ఏర్పాట్లు చేసేవారు.

## గస్తీ తిరిగే పాలకుడు!

ఓ రాత్రి తన నౌకరు అస్లమ్‌ని తోడుగా తీసుకుని మదీనాకు మూడు మైళ్లదూరాన సిరార్ అనే చోటి నుంచి వెడుతూ ఉండగా ఒక ముసలి మహిళ తన గుడారంలో ఏదో వండు కుంటూ కనిపించింది. ఆమె చుట్టూ కొందరు పిల్లలు కూచోని ఉన్నారు. దగ్గరికి వెళ్లి వింటే పిల్లల ఏడుపు వినిపిం చింది. అడిగితే ఆకలి వల్ల ఏడుస్తున్నట్లు ఆమె చెప్పింది. కుండలో వండేదేమిటీ అని అడిగితే అందులో ఏమీలేదని కేవలం నీళ్ళే అని, అలా వారిని మభ్య పెట్టి నిద్ర పుచ్చేందుకు చూస్తున్నట్లు జవాబు వచ్చింది. ఇది విని ఆయన వణక సాగారు. కంటి నుంచి ధారాపాతంగా అశ్రువులు కురవ సాగాయి.

నౌకరును వెంట బెట్టుకుని నగరానికి తిరిగి వచ్చారు. బైతుల్ మాల్ తలుపు తెరిచి పిండి బస్తా, జైతూన్ నూనె డబ్బా తీసు కున్నారు. నౌకరు తన భుజాన లేపమని అడిగితే, "రేపు ప్రళయ దినాన కూడా నీవు నా బరువు మోస్తావా?" అని చెప్పి ఆయన స్వయంగా అవి మోసుకు వచ్చి ఆ ముసలి మహిళ వద్ద పెట్టారు. ఆమె భోజనం సిద్ధం చేస్తూ ఉండగా ఆయన పొయ్యి ఊద సాగారు. ఆ మహిళ, "దైవం నీకు సత్ఫలితం అనుగ్రహించుగాక! అసలు నీవు ఖలీఫా కావాల్సింది, ఉమర్ కాదు" అని పలికింది. అప్పుడు ఆయన చెప్పారు, "అల్లాహ్ ఉమర్‌ని మన్నించుగాక! నీవు రేపు పిల్లల్ని తీసుకుని ఖలీఫా వద్దకు రా, అక్కడ నేనుంటాను, నీకు వేతనం నిర్ణయమవుతుంది" అని.

ఆయన ఇంతగా దయార్ద్ర హృదయులు, వాత్సల్యంగల వారయినప్పటికీ పెద్ద పెద్ద నాయకులు, సహచర మాన్యులు ఆయన పట్ల భయపడేవారు. ఆయన చేతిలో ఓ కొరడా మాత్రం ఉండేది, దానికే జనం కరవాలానికి భయపడినట్లు భయపడేవారు. ఒక వ్యక్తి, ఏ రక్షకుడు, బంట్రోతు, కత్తీ కరవాలం కూడా లేనివాడు, అతుకుల బట్టలు ధరించేవాడు, ఇంటి వారలే ఒంటె తోలుతో కుట్టిన పాదరక్షలు తొడిగే వాడు, ఇంటింటికీ వెళ్లి అవసరార్థులను ఆదుకునేవాడు, అయితే అతని మహత్తు, ఠీవి, అతని పట్ల గౌరవాదరణలు, బెదురు ఏ మేరకు ఉండేవంటే బహు దూరపు దేశాల పాలకులు తమ కోటల్లో భద్రంగా ఉంటూనే వణుకుతూ ఉండేవారు! దీన్ని ఆయనలోని సత్యతా మహత్తు అని తప్ప మరేమని చెప్పగలం! ❑

‘చరితార్థులు’-2



# మౌలానా ముహ్‌మూద్ హసన్

## (1851-1920)

41



**ప్రథమ** స్వాతంత్ర్య సంగ్రామంలో ఉలమాలు ఎంతటి అద్వితీయమైన పాత్ర పోషించారో జాతీయోద్యమంలో కూడా అంతటి మహత్తర భాగస్వామ్యాన్ని అందించిన మహనీయులలో మౌలానా మహ్‌మూద్ హసన్ అగ్రగణ్యులు. ఆయన 1851లో ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్ జిల్లా బరేలిలో జన్మించారు. తండ్రి మౌలానా జుల్ఫికర్ అలీ మార్గదర్శకత్వంలో స్వగ్రామంలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన మహ్మద్ హసన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం దేవ్‌బంద్‌లోని దార్-ఉల్-ఉలూంలో ప్రథమ విద్యార్థిగా చేరి తన అసాధారణ ప్రతిభ ద్వారా 1888లో ఆ విద్యా సంస్థ ప్రధానాచార్యులు అయ్యారు. బ్రిటిషర్ల బానిసత్వం నుండి మాతృభూమిని విముక్తం చేయాలన్న అంతర్గత లక్ష్యంతో ఏర్పడిన దార్-ఉల్-ఉలూం మహమూద్ హసన్ నేతృత్వంలో విముక్తి పోరాట యోధుల తయారీకి ముమ్మరంగా కృషిని ఆరంభించింది. 1911 నుంచి అంతర్జాతీయ రాజకీయాలలో వచ్చిన మార్పుల నేపథ్యంలో భారతదేశ వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోని గిరిజన ప్రజానీకం ద్వారా ఆంగ్ల సైన్యాల మీద దాడులు నిర్వహించి, స్వదేశంలోని ప్రజలు, భారతీయ సైనికులను తిరుగుబాటుకు పురికొల్పాలని ఆయన పథక రచన చేశారు. ఆ పథకం ప్రకారంగా తమ కార్యకలాపాలకు దేవ్‌బంద్‌ను కేంద్రస్థానం చేసుకుని, డిల్లీ, దినాపూర్, అమ్రోట్, కరాచి, ఛేదా, చక్వాల్, కాబూల్‌లలో శాఖలను ఏర్పాటు చేశారు.



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

1915లో తన శిష్యులు మౌలానా ఒబైదుల్లా సింధీ నాయకుడిగా ఒక ప్రతినిధి బృందాన్ని ఆఫ్ఘనిస్తాన్ పంపి 1916లో తానూ మక్కాకు పయనమయ్యారు. టర్కీ గవర్నర్ గాలిబ్ పాషాను కలసి తన పథకాన్ని వివరించి సానుకూలత సాధించిన ఆయన బ్రిటిష్ భారత సైన్యంలోని భారతీయులను తిరుగుబాటుకు ప్రోత్సహిస్తూ పలు చర్యలు చేపట్టారు. స్వదేశీయులలో తిరుగుబాటును ప్రోత్సహిస్తూ సిల్క్ వస్త్రం మీద రాసి ఇండియాకు పంపిన ఆయన వర్తమానం కాస్తా బ్రిటిష్ వేగుల చేతికి దొరికింది. ఈ సంఘటన భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సిల్క్ లేఖ కుట్రగా ఖ్యాతిగాంచింది. మౌలానా ఆంతర్యాన్ని పసిగట్టిన ఆంగ్లేయులు ఆయనను మాల్టా కారాగారంలో నిర్బంధించి, పలు విధాల హింసలకు గురి చేసి 1920లో విడుదల చేశారు. స్వదేశానికి రాగానే ఖిలాఫత్-సహాయ నిరాకరణోద్యమంలో ఆయన క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ఆ క్రమంలో అలీఘర్‌లో జాతీయ విశ్వవిద్యాలయం (జామియా మిలియా ఇస్లామియా) శంకుస్థాపన గావించారు. జామియత్ ఉలమా-యె-హింద్ సమావేశంలో ఉలమాలనుద్దేశించి ప్రసంగిస్తూ, సామ్రాజ్య వాద శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించమని పిలుపునిచ్చారు. అవిశ్రాంతంగా ధార్మిక-జాతీయోద్యమ కార్యకలాపాలలో పాల్గొనటం వలన ఆరోగ్యం పూర్తిగా క్షీణించి, 1920 నవంబరు 30న మౌలానా మహ్‌మూద్ హసన్ కన్నుమూశారు. ✤



# చదువు "కొ"ంటున్న వ్యాపారం

డా.ఎన్. కలీల్

**నేడు విద్య** ఒక వ్యాపారంగా రూపుదాల్చింది. విద్యనేకాదు విద్యార్థులతో సహా ఏకంగా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. బాలబాలికల పుస్తకాల బరువు, తల్లిదండ్రులకు ధనభారం మోయలేనంతగా పెరిగిపో తున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టా ల్సింది పాలకు లనే. ఈ విద్యావ్యాపారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. లాభసాటిగా ఉన్న ఈ వ్యాపారంలో గతంలో వ్యాపారాలు చేసిన వారు, కాంట్రాక్టర్లు, మరికొందరు రాజకీయ నాయకులు నేరుగా పాలు పంచుకుంటున్నారు. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలు ఉన్నా ఆ చట్టాల అమలు త్రికరణశుద్ధిగా చేయగలిగిన సామర్థ్యం ఉన్న అధికారులు లేకపోవడంతో పరిస్థితి రానురాను అగమ్య గోచరంగా మారుతున్నది. ప్రస్తుత విద్యాసంవత్సరం ఇంకా పూర్తి కాలేదు. పరీక్షలు జరుగుతు న్నాయి. వచ్చే విద్యా సంవత్స రానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసుకుంటున్నారు. అడిగేవారు, అడ్డగించేవారు కరవైపోయారు. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్ట ణాల్లో, నగరాల్లో అక్కడక్కడ ప్రైవేట్ బడులు నడిచేవి. వాటిలో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవి కావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవా దృక్పథంతో ఆ విద్యా సంస్థలు నడిచేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి బడులు నడిపేవారు. అందువల్ల ఆనాడు ప్రైవేట్ పాఠశాలలను అరికట్టాల్సిన అవసరం లేకుండా

పోయింది. అందుకే చట్టాల అవసరం తలెత్తలేదు. ప్రభుత్వ విద్య కూడా అంతో ఇంతో పటిష్టంగా నడిచేది. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు అవినీతి వీటన్నింటిని మించి నేతలు ఎన్ని నీతులు వల్లిస్తున్నా, ఎన్ని మాటలు చెప్తున్నా రాజకీయ జోక్యంతో ప్రభుత్వ విద్య నానాటికీ దిగజారిపోతున్నది. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ననే ఆందోళనలు కూడా వ్యక్తమవు తున్నాయి. బీదాబిక్కి జనం ప్రైవేట్ విద్య కోసం ఆరాటపడుతున్నారు. ఏ మాత్రం ఆర్థిక వసతులు లేక, మరో దారి లేనివారే విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వబాట పడుతున్నారు. గ్రామాలకు ఈ ప్రైవేట్ వ్యాపారం గత రెండు, మూడు దశాబ్దాల క్రితం వరకు అంతగా సోకక పోవడంతో పట్టణాలకు పంపించి చది వించే ఆర్థిక స్థోమత లేని మధ్య తరగతి ప్రజలు సైతం తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యపై ఆధారపడ్డారు. ఇప్పుడు మండల కేంద్రాలు, చివరకు గ్రామాలకు సైతం ఈ విద్యావ్యాపారం విస్తరించిపోతున్నది. వాహనాలు పెట్టి శివారు పల్లెల నుండి సైతం పిల్లలను తెప్పించు కుంటున్నారు. కూలీనాలి చేసుకొని రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు సైతం ప్రైవేట్ బడుల బాటపడుతున్నారు. ఇక రానురాను ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది.

ఎందుకు ఈ పరిస్థితి దాపురిస్తున్నది? కారకులు ఎవరు? కారణాలు ఏమిటి? అనేవి అటు అధికార వర్గాలకు కానీ, ఇటు పాలకులకు కానీ తెలియని విషయం కాదు. అయినా ఈ దుర్మార్గపు వ్యాపారానికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఒకపక్క మధ్యాహ్న భోజన పథకం లాంటి ఎన్నో ఆశలు చూపుతూ ఉచితంగా పుస్తకాలిచ్చి బోధన చేస్తున్నా ప్రభుత్వ పాఠశాలలకు రావడానికి ఇష్టపడక డబ్బులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలల వైపు ఎందుకు మక్కువ చూపుతున్నారో పరిశీలించా ల్సిన తరుణమిది. ప్రభుత్వాలు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉంటున్నాయి. కానీ ఆచరణకు వచ్చేసరికి అసలు సమస్యలు ప్రారంభమవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో అన్ని పాఠశాలల్లో




కలిపి ఒకటో తరగతిలో దాదాపు నలభై లక్షల మందికి పైగా చేరుతున్నారు. వారిలో యాభైశాతం కూడా ఉన్నత విద్య వరకు చేరుకోవడం లేదు. రకరకాల కారణాలతో ప్రాథమిక విద్య దశలోనే చదువుకు స్వస్తి చెబుతున్నారు. లక్షలాది మంది బాల బాలికలెందరో ఉన్నారు. ప్రభుత్వాలు బడిబాట అంటూ మళ్లీ పాఠశాలల్లో చేర్పించే ప్రయత్నాలు చేస్తున్నా అవి ఆశించిన ఫలితాలు ఇవ్వడంలేదు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే అంచనాల ప్రకారం దాదాపు పదివేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అంచనా. ఇక అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేకపోవడంతో బాలబాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పాలకులు మాటల్లో చెప్తున్నట్లుగా చేతల్లో చూపించలేకపోతున్నారు. దేశాభివృద్ధికే కాదు. మానవ జాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదం. ఆరేళ్ల నుంచి పధ్నాలుగు యేళ్ల వరకు బాలబాలికలందరికి ఉచిత విద్య అందిం చాలన్న లక్ష్యం కనుచూపు మేరలో కన్పించడం లేదు. ఇక డిపెప్, ఎపెప్, సర్వశిక్షణ అభియాన్ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి దేశ వ్యాప్తంగా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. బాలబాలికలను భావిభారత పౌరులుగాతీర్చదిద్దాల్సిన విద్యా వ్యవస్థను ఇంతటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టడం దురదృష్ట కరం. ❑

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# సహనం - స్వర్గానికి, సాఫల్యానికి సోపానం

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రి

**"ఓ విశ్వసించిన ప్రజలారా! సహనం పాటించండి. మిథ్యావాదుల ముందు ధైర్యసాహసాలు ప్రదర్శించండి. ధర్మసేవ కోసం నడుం బిగించండి. దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. అప్పుడే మీరు (ఇహపరాల్లో) కృతార్థులవుతారని ఆశించగలరు". (ఆలి ఇమ్రాన్: 200)**

### అధినాయకత్వానికి ఆనవాలు సహనం

సహనం అనేది స్థితప్రజ్ఞకు సూచిక. ఎక్కడ ఈ గుణం ఉంటుందో అక్కడ మేధా వికాసం ఉంటుంది. చరిత్రను తిరగరాసిన మహామహులంతా తమ నడకలో, నడతలో నడవడికలో సహనాన్ని, వినయాన్ని ప్రదర్శించినవారే. ఈ గుణాలు విజేతల లక్షణాలని ఖుర్ఆన్ చెబుతుంది:

వారు (కష్టాలు ఎదురైనప్పుడు) సహనం వహిస్తూ, మా సూక్తులు విశ్వసిస్తున్నంత కాలం మేము వారిలో మా ఆజ్ఞల ప్రకారం వారికి మార్గ దర్శకత్వం వహించే నాయకుల్ని ఉద్భవింపజేశాం. (అస్-సజ్దా: 24)

సహనం ఒక నిగ్రహశక్తి. మానసిక పరిపక్వత గల స్థితి. ఈ గుణం కలిగినవారు ఎల్లప్పుడూ నిశ్చలంగా ఉంటారు. వారు జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను అవలీలగా ఎదుర్కొంటారు. సహనం మనిషిని ఆలోచింపజేస్తుంది. మనిషి ఆవేశపడకుండా ఆపుతుంది. మనిషిని ఉన్నత మార్గంలో నడిపిస్తుంది. అలాగే మనిషి కోపావేశంలో ఉన్నప్పుడు, ఈ కోపం షైతాన్ దుష్ప్రేరణ వల్ల వచ్చిందని భావించి, దాన్నుండి అల్లాహ్ శరణు వేడుకోవాలి. అవూజు బిల్లాహి మినష్ షైతానిర్రజీమ్ అనే ఈ మేల్కొలుపే అతని క్రోధానికి మంచి విరుగుడుగా పనిచేస్తుంది. చీటికీ మాటికీ నిప్పులు చెరుగుతూ అదుపు తప్పి ప్రవర్తించేవారు ప్రవక్త మహనీయులు చెప్పిన 'తఅవ్వుజ్' (శరణు వేడే) సూక్తిని పఠిస్తే మంచి ఫలితం ఉంటుంది.

### సహనంతోనే విజయం సహనంలోనే విజయం

దైవప్రవక్త (స) అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) గారినుద్దేశించి ఇలా అన్నారు: బాబూ! నీవు అల్లాహ్ (హక్కులను) గుర్తుంచుకో; నీవు ఆయన్ని నీ ముందున్నట్లు గ్రహిస్తావు. ఆనంద ఘడియల్లో నువ్వు అల్లాహ్‌ను జ్ఞాపకముంచుకో. ఆపద సమయాల్లో ఆయన నిన్ను జ్ఞాపక ముంచుకుంటాడు (అంటే నిన్ను ఆ కష్టాలనుండి గట్టెక్కిస్తాడు). నీ నుండి తప్పిపోయింది నీకు చేకూరేది కాదనీ, నీకు చేకూరింది నీ నుండి తప్పిపోయేది కాదని తెలుసుకో! ఇంకా ఈ విషయం కూడా తెలుసుకో! (దైవ) సహాయం సహనం వెంటే ఉంటుంది. కలిమితో పాటే లేమి ఉంటుంది. కష్టంతోపాటే సుఖం ఉంటుంది." (తిర్మిజీ)

సహనం ఒక అమూల్య సంపద. అందుకే ఈ సుగుణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడవకూడదు. ప్రతి మనిషికీ తన దైనందిన వ్యవహారాల్లో ఎన్నో గడ్డు పరిస్థితులు, సమస్యల సునామీలు ఎదురవుతుంటాయి. ఇది ప్రకృతి సహజం. ఆ సందర్భాల్లో మనిషి నిగ్రహశక్తిని పాటించాలి. స్థితప్రజ్ఞతో వ్యవహరించాలి. ఆధ్యాత్మిక జ్ఞానం, వివేకం సహనానికి ఎంతగానో సహాయపడతాయి. అందుకే ఈ సహజ గుణం ఎన్నో దుర్మార్గాలను ఆపుతుంది. కాబట్టి ఒకరు మన యెడల అనుచితంగా వ్యవహరించినా మనం మాత్రం పగను పెంచుకోకూడదు. దాన్ని అధిగమించడమే శుభం. ఎందుకంటే, పగతో పగ ఎప్పుడూ చల్లారదు. నిప్పుతో నిప్పు ఎప్పుడూ శాంతించదు.

అసహనం వల్ల క్షణికావేశం కలుగుతుంది. క్షణికావేశం వల్లే ఎన్నో అవాంఛిత సంఘటనలు జరుగుతాయి. ఆవేశకావేశాలు మనిషి నాశనానికి కారణమవుతాయి. ఇస్రాయీల్ సంతతికి చెందిన ప్రజలు -ఎలాంటి కాయకష్టం లేకుండానే అల్లాహ్ నుంచి లభించే మన్ మరియు సల్వా అనే అద్భుత ఆహారం పట్ల సంతృప్తి చెందక, అసహనానికి లోనై- "మూసా! మేమిక ఒకే విధమైన ఈ తిండి తింటూ వుండలేము. మా కోసం నేల నుండి ఉత్పత్తి అయ్యే కూరగాయలు, దోసకాయలు, వెల్లుల్లి, గోధుమలు, పప్పు ధాన్యాలు, ఉల్లిపాయలు మొదలైన ఆహార పదార్థాలు పండింప జేయమని నీ ప్రభువును ప్రార్థించు." (అల్-బఖరా: 61) అన్న తర్వాత వారికి పట్టిన దుర్గతికి చరిత్రే సాక్షి! సహనం, శాంతం- మనిషిని అత్యున్నత శిఖరాలకు చేరిస్తే, అసహనం, అసంతృప్తి, అనుగ్రహాల యెడల కృతఘ్నత మనిషిని పాతాళానికి తొక్కివేస్తుంది.

## సహనం సమర్థుడి అత్యున్నత ఆభరణం

ఒక లక్ష్యం సాధించాలనుకున్నప్పుడు, మనో నిబ్బరం కోల్పోకుండా ధైర్యస్థైర్యాలు కనబరచడం, నిదానంగా సమయస్ఫూర్తితో వ్యవహరించడం కూడా సహనమే. అలాంటి సహనమే సత్ఫలితాలను ఇస్తుంది. ఆశించింది లభించకపోతే సహనం కోల్పోవడం కొందరి నైజం. ఇది తిరోగమనానికి సంకేతం. ఓర్పు వహించి నేర్పుతో ప్రయత్నిస్తే కోరుకున్న ఫలితాలు తప్పక లభిస్తాయి.

సహనంతో వ్యవహరిస్తూ (ప్రత్యర్థిని) క్షమించగలిగితే (ఎంతో మంచిది). ఇది ఎంతో ధైర్యసాహసాలతో కూడిన పని. (షూరా: 43)

సహనం మనిషిని మహాత్మ్ముణ్ణి చేస్తుంది. సామాన్యుణ్ని మాన్యుణ్ని చేస్తుంది. సత్యాన్ని చూపిస్తుంది. మనిషిని చరిత్రలో నిలబెడుతుంది. అందుకే ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సహనంతో ఎదుర్కోవాలి. అప్పుడు విజయం దానంతట అదే వరిస్తుంది. అందుకే ఈ విలువైన సహన గుణం మనందరికీ మేలిమి ఆభరణమవాలి. ఆ నిమిత్తం పనికొచ్చే కొన్ని విషయాలను తెలుసుకుందాం!

**సహనం అంటే ఏమిటి :** నిర్దిష్ట లక్ష్యాలను సాధించడానికి భావోద్వేగాల్ని అదుపులో ఉంచుకుంటూ, నిరంతరం అంకిత భావంతో చేసే కృషి, అవాంతరాలెదురైన సందర్భాల్లో సైతం పక్కకు తప్పుకోకుండా ఆత్మస్థైర్యంతో పట్టుదలతో ఎదుర్కోవడం, పొగడ్తలకు, విమర్శలకు ప్రాధాన్యమివ్వకుండా చేసే యజ్ఞం. కార్యక్షేత్రం ఏదైనా కోరుకున్న ఫలితాలను సాధించాలంటే శిఖరాలను అధిరోహించాలంటే సహనం తప్పనిసరి. ప్రపంచ మనుగడే సహనంతో ముడివడి ఉంది.

సహనం లోపించడం వల్ల కలిగిన అనర్థాలకు చరిత్ర ఘట్టాలే మనకు సాక్ష్యాలు. గొప్ప గొప్ప సామ్రాజ్యాలు బుగ్గిపాలు కావడం, గొప్ప నియంతలు మట్టిలో కలవడం లాంటివి ఎన్నో జరిగాయి. అసహనంతో నిండిన మనసు అసూయాద్వేషాలకు నివాస స్థలం.

శాంతం అవసరమని మన పూర్వీకులు నేర్పించారు. జీవితంలో ఆధ్యాత్మిక లక్షణాలను నేర్చుకోవాలన్నా, భౌతిక పరమైనవి దక్కించుకోవాలన్నా మనిషికి సహనం తప్పనిసరి. చాలామంది ఎన్నో ముఖ్యమైన విషయాలలో 'అది నాకు సంబంధించింది కాదు' అని కొట్టిపారేస్తుంటారు. మనిషి తన జీవన విధానాన్ని పరిశీలిస్తే ప్రతిరోజూ తన ప్రమేయం లేకుండానే ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంతో కొంత తెలిసో, తెలియకో అనుసరిస్తూనే ఉంటాడు. ఇందులో గమ్మత్తేమిటంటే తను అనుసరిస్తున్నది ఆధ్యాత్మిక సంబంధమైనదని భావించకపోవడం.

పరమత సహనం లేనందువల్లే ఎన్నో వికృతమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. విచిత్రమేమిటంటే అన్ని మతాలు సహనాన్నే బోధిస్తాయి. వాటిని చదవడం, వినడంతో సరిపోదు. హితబోధలు చేసే గ్రంథాల మర్మం కనుగొన్న వాడే సహనాన్ని అర్థం చేసుకోగలడు! మనిషికి సరైన వైఖరి, విశ్వాసం ఉంటే నిస్సహాయ పరిస్థితుల్లో సైతం అత్యద్భుతమైన మార్పులు చోటు చేసుకుంటాయి. సహనం నిండుగా ఉంటే దైవ సహాయం తోడై కొండలను సైతం కదిలించవచ్చునని గ్రహించాలి.

## అల్లాహ్ ఆదేశం సహనం

ఇమామ్ ఇబ్నె తైమియా (రహ్మ) ఇలా అన్నారు: అల్లాహ్ తన గ్రంథంలో తొంభైకి పైగా చోట్ల సహనం గురించి ప్రస్తావించాడు.

దానిని ప్రార్థనతో ముడిపెట్టాడు. ఇలా అన్నాడు: విశ్వాసులారా! సహనం వహించి, ప్రార్థన చేస్తూ (మా) సహాయం అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ సహనం వహించేవారికే తోడుగా ఉంటాడు. (అల్ బఖరహ్: 153)

## ప్రవక్త (స) సంప్రదాయం సహనం

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ఇప్పటికీ నాకు ప్రవక్తల్లో ఎవరో ఒకరి సంఘటన ప్రత్యక్షంగా చూస్తున్నానేమోననిపిస్తోంది. ఆ ప్రవక్తను ఆయన జాతి ప్రజలు రక్తసిక్తమయ్యేలా కొట్టారు. అప్పుడు ఆ ప్రవక్త "ఓ అల్లాహ్! నా జాతి వారు అమాయకులు. వారికేమీ తెలీదు, నువ్వు వారిని క్షమించు" అని ముఖం నుంచి కారుతున్న రక్తాన్ని తుడుచు కుంటూ దైవాన్ని వేడుకోసాగారు. (బుఖారీ - ముస్లిం) - ఆయనెవరో కాదు స్వయంగా మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారే.

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ఎవడైతే యాచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తాడో అల్లాహ్ అతన్ని కాపాడుతాడు. నిరపేక్షాభావం అలవరచుకోవాలనుకున్న వ్యక్తిని అల్లాహ్ నిరపేక్షాపరునిగా చేస్తాడు. సహనం కోరే వ్యక్తికి అల్లాహ్ సహనం వహించే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు. మనిషికి ఇవ్వబడిన కానుకల్లో ఓర్పుకు మించిన మేలైన, విశాలమైన కానుక మరొకటి లేదు. (బుఖారీ- ముస్లిం)

మంచి కాలం మించిపోతుంది- మనం ఈ ప్రసంగం వింటుండ గానే కొన్ని నిమిషాలు దొర్లిపోయాయి. నిమిషాలే కాదు మన గతం, వర్తమానం, భవిష్యత్తు కూడా గడిచిపోతుంది. ఈ చరాచర జగత్తు అంతా ఒక సమయంలో పుట్టి మరో సమయంలో ముగియడానికే.

'గత యుగాల గురించి మనకేం పెద్దగా ఏమీ తెలీదు. అలాగే భవిష్యత్తును తెలుసుకోలేం... వర్తమానం కొంత వరకు మన చేతుల్లో ఉంది.. దాన్ని ఎలా సద్వినియోగ పర్చుకోవాలో ఆలోచించాలి. వందేళ్ల మనిషి జీవితం ఎంత స్వల్పమైందో, జగత్తులో తన స్థానమెంటో, స్థాయి ఏంటో తెలుసుకుని మనిషి ప్రవర్తిం చాలి. అనంత విశ్వంతో పోల్చుకుంటే మనిషి ఎంత స్వల్పమో తెలుసు కుని నడుచుకోవాలి. కాలగమనం మనకో పాఠం నేర్పుతుంది. ముందుకు సాగడమే మన కర్తవ్యమని, నిరాశా నిస్పృహలకు అతీతంగా విధ్యుక్త ధర్మాన్ని ఆచరించేవారికి సమయం కూడా సహస్ర హస్తాలతో సహకరిస్తూనే ఉంటుంది.

నాకు కాలం కలిసిరావడం లేదు. ఏం చేసినా ఫలితం ఉండడం లేదు. చోటు మారితే ఏమైనా ఫలితం ఉంటుందా? తేదీ మారితే ఫలితం ఏమైనా ఉంటుందా? చోటు మారడం వల్ల జీవితంలో ఏ మార్పూ ఉండదు. తేదీ మారడం వల్ల జీవితంలో ఏ మార్పూ చోటు చేసుకోదు. మన మనస్సు మారాలి, మనోబలం లేనిదే ఆధ్యాత్మికంగానే కాదు, ప్రాపంచికంగా కూడా అభ్యున్నతి సాధించలేం. తనపై తనకు నమ్మకం లేనివాళ్లకు ఈ రమజాను శుభ కాలం కూడా ఏం సహకరిస్తుంది? దృఢమైన సంకల్పంతో ప్రయత్నం చేయడమే మన కర్తవ్యం.

ఏ జాతి అయినా తనను తాను సంస్కరించుకోనంత వరకూ అల్లాహ్ దాని పరిస్థితి మార్చడు. ఇదొక యదార్థం. (అర్-రాద్: 11)

కొందరు నిద్ర పట్టక అశాంతితో తన కష్టాల గురించి ఆలోచిస్తూ ఓ ఇటూ అటూ తిరుగుతుంటారు . సంఘటనలు సముద్రంలో అలల్లా వస్తూపోతూ ఉంటాయి. ఎరుక లేకపోవడం వల్లనే ఇంత బాధ కలుగుతుంది. కొద్ది రోజులయ్యాక మనమేనా బాధపడింది! అని నవ్వుకుంటాము. నిద్రలో నుంచి మేలుకున్నాక కలకు ఎంత విలువనిస్తామో. జ్ఞానవంతులవయ్యాక జీవితంలో కష్టనష్టాలకు అంతే విలువనిస్తాము.


**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:

**1800 572 3000**

# రూహ్ అఫ్జా




- సల్మాన్ హైదర్

**ఒక** శతాబ్దానికి పైగా, భారతదేశం, పాకిస్తాన్‌లోని ప్రజలు గులాబీ సువాసన, క్రిమ్సన్ షేడ్‌తో కూడిన కూలింగ్ స్క్వాష్ అయిన రూహ్ అఫ్జాను ఆస్వాదిస్తున్నారు. ప్రసిద్ధ యునాని హకీమ్ హఫీజ్ అబ్దుల్ మజీద్, 1907 వేసవిలో వివిధ పండ్లు, ఔషధ మూలికలు, పువ్వులు, మసాలా దినుసులను కలపడం ద్వారా  శరీరాన్ని హైడ్రేట్, చల్లబరిచే పానీయాన్ని తయారు చేసాడు. ఆ పానీయం పేరు, 'రూహ్ అఫ్జా', ఉర్దూలో "ఆత్మ పునరుజ్జీవనం" అని అర్థం.

రూహ్ అఫ్జా ఒక శతాబ్దానికి పైగా దక్షిణాసియా వేసవి పానీయంగా  ఉంది. సంవత్సరాలుగా, ఇది రమజాన్ సందర్భంగా ఇఫ్తార్ వంటకాలలో భాగమైంది. ప్రజలు ఖర్జూరం, పకోడా, పుచ్చకాయతో పాటు రూహ్ అఫ్జా పానీయాన్ని ఇఫ్తార్‌లో ఆస్వాదిస్తారు.

గల్ఫ్ ప్రాంతంలో, భారతీయ ప్రవాసులలో, రూహ్ అఫ్జా లేకుండా ఇఫ్తార్ అసంపూర్ణంగా  ఉంటుంది. రమజాన్ ఉపవాసాన్ని  విరమించుకోవడానికి  తరచూ ఇష్టపడే పానీయం రూహ్ అఫ్జా. సుదీర్ఘమైన ఉపవాసం తర్వాత చాలా అవసరమైన శక్తిని రూహ్ అఫ్జా అందిస్తుంది.

భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో దీనిని హమ్దర్ద్ లాబొరేటరీస్ ఇండియా, హమ్దర్ద్ లాబొరేటరీస్ (వక్ఫ్) పాకిస్తాన్, హమ్దర్ద్ లాబొరేటరీస్ (వక్ఫ్)  బంగ్లాదేశ్‌లు ఉత్పత్తి చేస్తాయి.

1925లో హకీమ్ హఫీజ్ అబ్దుల్ మజీద్ మరణించిన తర్వాత, అతని భార్య రబియా బేగం సంస్థను చారిటబుల్ ట్రస్ట్‌గా మార్చారు. హమ్దర్ద్ వక్ఫ్ అని పిలువబడే ఇస్లామిక్ ట్రస్ట్‌గా నమోదు చేయబడింది. దాని నిబంధనల ప్రకారం, దాని లాభాలలో 85 శాతాన్ని  విద్యా స్వచ్ఛంద సంస్థ అయిన హమ్దర్ద్ నేషనల్ ఫౌండేషన్‌కు బదిలీ చేస్తుంది. ఈ ఫౌండేషన్ ఇతర సంస్థలతోపాటు ఢిల్లీలో జామియా హమ్దర్ద్‌ను నడుపుతోంది. ఢిల్లీలోని ఏకైక ప్రైవేట్ మెడికల్ కాలేజీని నిర్వహిస్తున్న ఘనత హమ్దర్ద్ డీమ్డ్ యూనివర్సిటీకి ఉంది.

పాకిస్తాన్‌లో, రూహ్ అఫ్జాను 'దేశం యొక్క పానీయం' అని పిలుస్తారు. రూహ్ అఫ్జా భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ సంస్కృతీ సంప్రదాయాలలో విశిష్ట స్థానాన్ని పొందింది.

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది   ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

1 – 4 హా, మీమ్. ఒట్టు, ఈ ప్రస్ఫుటమయిన గ్రంథం పైన. మేము దీనిని అరబీ ఖుర్ఆన్‌గా చేశాము, మీరు దాన్ని అర్థం చేసుకోవాలని.[1] వాస్తవానికి ఇది గ్రంథమాతృకలో పొందుపరచబడి ఉంది[2] మా వద్ద ఎంతో ఉన్నత స్థానం, విజ్ఞత నిండిన గ్రంథం.

1. దివ్య ఖుర్ఆన్ ప్రమాణం చేసి చెప్పిన విషయం, ఈ గ్రంథానికి రచయితలము 'మేము', ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) కాదు అన్నది. ప్రమాణం చేయడానికి ఎన్నుకున్న ఖుర్ఆన్ గుణం, ఇది "ప్రస్ఫుటమయిన గ్రంథం" అన్నది. ఈ గుణం గల ఖుర్ఆన్ దైవవచనం అవడం పట్ల స్వయంగా ఖుర్ఆన్‌పై ప్రమాణం చేయడం దానంతట అదే ఈ అర్థాన్ని స్ఫురింపజేస్తుంది, జనులారా, ఈ తెరచిన పుస్తకం మీ ఎదుట ఉంది. దీన్ని కళ్ళు తెరచుకుని చూడండి, ఇందులోని అతి ప్రస్ఫుటమయిన, ఎటువంటి అస్పష్టతా లేని విషయాలు, దీని భాష, దీని సాహిత్యం, సత్యాసత్యాల మధ్య ఒక విశదమయిన విచక్షణా రేఖను గీసే దీని బోధనలు, ఇవన్నీ ఒక వాస్తవికతను చాటి నిరూపిస్తున్నాయి. దీని రచయిత విశ్వ ప్రభువు తప్ప మరెవరూ కాజాలరని.

"మేము దీనిని అరబీ భాష ఖుర్ఆన్‌గా చేశాము. మీరు దాన్ని అర్థం చేసుకోవాలని" అని సెలవిచ్చిన దానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి, ఇది ఏదో పరాయిభాషలో లేదు, మీ స్వంత భాషలోనే ఉంది. అందువల్ల దీన్ని పరిశీలించడం, పరీక్షించడం, దీని ఘనతను, విలువను అంచనా వేయడంలో మీకు ఎటువంటి కష్టం కలగదు. ఇది ఏదయినా అరబ్బేతర భాషలో ఉన్నట్లయితే, ఇది దైవవచనమో కాదో అన్న విషయం ఎలా పరీక్షించాలి, ఇది మాకసలు బోధపడటమే లేదే అని మీరు అశక్తతను వెలిబుచ్చగలిగేవారు. కాని ఈ అరబీ ఖుర్ఆన్ విషయంలో మీరు ఈ సాకు ఎలా చెప్పగలరు. ఇందులోని ఒక్కొక్క పదం మీకు విశదమయినదే. దీని ప్రతి వచనం, భాష, విషయం రెండు విధాలా మీకు ప్రస్ఫుటమయినదే. స్వయంగా చూసుకోండి, ఇది ముహమ్మద్ (స) రచనో లేదా ఇతర అరబ్బు వ్యక్తి రచనో కాగలదా. ఈ సూక్తికి మరో భావం ఏమిటంటే, ఈ గ్రంథం భాష మేము అరబీ భాషగా నిర్ణయించడానికి కారణం, మేము అరబ్బు జాతిని సంబోధించడం. ఆ జాతి అరబీ భాషలోని ఖుర్ఆన్‌నే అర్థం చేసుకోగలదు. అరబీలో ఖుర్ఆన్ అవతరణకు సంబంధించిన ఈ స్పష్టమయిన సమంజసమయిన కారణాన్ని ఉపేక్షించి, కేవలం మహనీయ ముహమ్మద్ (స) మాతృభాష కూడా అరబీయే అన్న కారణం చేత ఇది దైవ వచనం కాదు, ముహమ్మద్ (స) వచనం అనే వ్యక్తి చాలా అన్యాయం చేస్తున్నాడు. (ఈ రెండవ భావాన్ని అర్థం చేసుకునేందుకు ఖుర్ఆన్ అవగాహనం 7వ సంపుటం హా మీమ్ అస్సజ్దా:44, పాద సూచి నెం. 54తో పాటు పరిశీలించండి).

2. "ఉమ్ముల్ కితాబ్" లేదా "గ్రంథ మాతృక" అంటే ఉద్దేశం "మూల గ్రంథం" అన్నది. అంటే ప్రవక్తలందరికీ అవతరించిన గ్రంథాలు ఎక్కడి నుండి గ్రహించబడ్డాయో ఆ మూలగ్రంథం అని భావం. దీనినే 'వాకిఆ' సూరాలో (భద్రంగా దాచిపెట్టిన గ్రంథం) అని చెప్పడం జరిగింది. బురూజ్ సూరాలో దీనికి (భద్రమయిన, రక్షితమయిన ఫలకం) అన్న పదాలు ప్రయోగించబడ్డాయి. అంటే, ఆ ఫలకంలో వ్రాయబడిన దీన్ని తుడిచిపెట్టడం సాధ్యపడదు, అన్ని రకాల జోక్యానికి భద్రమయినది అన్నమాట. ఖుర్ఆన్‌ని గురించి అది "ఉమ్ముల్ కితాబ్"లో ఉంది అని చెప్పి ఒక ముఖ్యమయిన వాస్తవికత పట్ల జాగృతపరచడం జరిగింది. పరమ ప్రభువు వద్ద నుండి విభిన్న కాలాల్లో, విభిన్న ప్రాంతాల్లో, విభిన్న జాతుల్లో దైవ మార్గదర్శకత్వం కొరకు విభిన్న ప్రవక్తలకు విభిన్న భాషల్లో గ్రంథాలు అవతరిస్తూ ఉన్నాయి. కాని వాటంతటి సందేశం ఒకే విశ్వాసాన్ని అందజేసింది. ఒకే నిజాన్ని 'పరమ సత్యం'గా పరిగణించడం జరిగింది.

మంచీ చెడుల ప్రమాణం ఒక్కటే ముందుంచడం జరిగింది. నైతికత, నాగరికతల సమానమయిన సూత్రాలు తెలుపబడ్డాయి. మొత్తానికి ఈ గ్రంథాలన్నీ అందజేసిన ధర్మం ఒక్కటే. దీనికి కారణం వీటంతటి మూలం ఒకటే కావడం, కేవలం వచనాలు వేరు. పరమ ప్రభువు అల్లాహ్ వద్ద ఒక మూల గ్రంథంలో పొందుపరచబడి ఉన్న భావం ఒక్కటే. అవసరం కలిగినప్పుడల్లా ఆయన ఒక ప్రవక్తను ప్రభవింపజేసి ఆ భావాన్ని అప్పటి పరిస్థితులు, సందర్భాన్నిబట్టి ఒక ప్రత్యేక వచనం, ప్రత్యేక భాషలో అవతరింపజేశాడు. ఒకవేళ అల్లాహ్ ముహమ్మద్(స)ను అరేబియాలో కాక మరో జాతిలో పుట్టించాలని అనుకున్నట్లయితే ఇదే ఖుర్ఆన్, ప్రవక్తశ్రీ (స) వద్దకు ఆ జాతి భాషలోనే అవతరింపజేసేవాడు. అందులో సందేశం, ఆ జాతి, ఆ దేశంలోని పరిస్థితుల రీత్యానే బోధించబడేది. వచనాలూ వేరుగా ఉండేవి, భాష కూడా వేరుగా ఉండేది. కాని మూలతః బోధనలు, మార్గబోధన, ఇదే ఉండేది. అది అరబీ ఖుర్ఆన్ కాకపోయినప్పటికీ అది ఇదే ఖుర్ఆన్‌గా ఉండేది. ఇదే విషయాన్ని షుఅరా సూరాలో ఇలా చెప్పడం జరిగింది, "ఇది సర్వలోక ప్రభువు వద్ద నుండి అవతరించిన గ్రంథం. అతి స్పష్టమయిన అరబీ భాషలో ఉంది. ఇది పూర్వ ప్రజల గ్రంథాలలోనూ ఉంది" *(వివరణకు చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.5, అష్ షుఅరా : ఆయత్‌లు 192, 196, పాద సూచికలు 119, 121).*

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

**3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం**

## అధ్యాయం : 42

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు." *(అల్ హష్ర్ : 9)*

**434)** హ్జ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు: ఒక వ్యక్తి దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చాడు, అతను బాగా ఆకలితో ఉన్నాడు. ఆయన(స) తన భార్యలకు కబురంపారు. ఆ వ్యక్తికి భోజన ఏర్పాటు చేయమని. ఇంట్లో మంచి నీళ్ళు తప్ప తినటానికి మరేమీ లేదని వారి నుండి సమాధానం వచ్చింది. అప్పుడు దైవ ప్రవక్త (స), "ఈ వ్యక్తికి ఆతిథ్యం ఇచ్చేవారెవరు?" అని సహచరులను అడగ్గా, 'నేనిస్తాను' అని ఒక అన్సార్ సహాబీ[1] చెప్పారు. ఆ సహాబీ ఆ వ్యక్తిని వెంటబెట్టుకుని తన ఇంటికి వెళ్లారు. 'దైవప్రవక్త అతిథికి మర్యాద చెయ్యి' అని భార్యను ఆదేశించారు. 'అయ్యో, ఇంట్లో పిల్లల అన్నం తప్ప మరొకటి లేదండి' అని ఆమె చెప్పింది. 'ఇంట్లో ఏముంటే అదే వడ్డించు. దీపం వెలిగించు, పిల్లలకు ఏదో ఒకటి చెప్పి పడుకోబెట్టు' అని భార్యకు సూచించారు ఆ సహాబి. భర్త సూచించినట్లే భోజనం వడ్డించి, దీపం వెలిగించింది ఆ ఇల్లాలు. ఏదో ఒక వంకతో పిల్లల్ని నిద్రపుచ్చింది. దీపాన్ని సరిచేస్తున్నట్లుగా నటించి, ఆర్పివేసింది. ఆ తరువాత ఆ భార్యాభర్తలిద్దరూ కూడా భోజనం చేస్తున్నట్లే నటించారు చీకట్లో.[2] కాని వారిద్దరూ (తమ పిల్లలతోపాటే) ఆ రాత్రి పస్తులుండిపోయారు. తెల్లవారాక ఆ సహాబీ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చినప్పుడు, "రాత్రి మీ దంపతులిద్దరూ చేసిన మంచి పనిపై అల్లాహ్ నవ్వేశాడు, ఆశ్చర్యపోయాడు"[3] అని చెప్పారు. ఆ తర్వాత అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: "వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వాస్తవానికి ఆత్మలోభత్వం నుండి రక్షింపబడినవారే సాఫల్యం పొందేవారు."[4] *(అల్ హష్ర్ : 9)*

**435)** అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని హిషామ్ బిన్ జైద్ తెలిపారు. అనస్(రజి) ఇలా చెప్పారు: హ్జ్రత్ అబూబక్ర్(రజి), హ్జ్రత్ అబ్బాస్ (రజి)లు ఇద్దరూ అన్సార్లు కూర్చుని ఉన్న ఒక సమావేశం వైపు నుండి సాగిపోతూ, అక్కడ కూర్చున్న వారంతా దుఃఖంతో విలపించటం గమనించారు. ఇంతకీ మీ దుఃఖానికి కారణం ఏమిటి? అని వారు అడిగితే, "ఇప్పుడే మేము దైవప్రవక్త(స) సమావేశాలను స్మరించుకున్నాము. ఆ సమావేశాలలో మేము కూర్చునేవారం (దైవప్రవక్త-స-మరణవ్యాధికి గురై ఉన్నప్పటి సంఘటన ఇది)" అని వారు చెప్పారు. ఇది విని వారిద్దరూ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. అన్సార్ల పరిస్థితిని ప్రవక్తకు తెలియపరిచారు. అప్పుడు దైవప్రవక్త(స) బయటికి వచ్చారు. తలపై (తలనొప్పి కారణంగా) పట్టీ కట్టబడి ఉంది- ఉల్లేఖకుడు ఇలా అన్నారు: దైవ ప్రవక్త(స) వేదికపైకి వచ్చారు (ఆయన-స- వేదికను అలంకరించటం అదే చివరిసారి). ఆ తరువాత ఆయన ఆ వేదికను అలంకరించలేక పోయారు. ఆయన (స) దైవస్తోత్రం చేశారు. పిదప ఇలా అన్నారు: "నేను మీకు అన్సార్ల గురించి గట్టిగా తాకీదు చేస్తున్నాను. వారు నా ప్రాణం. వారు తమపై గల బాధ్యతలన్నింటినీ నెరవేర్చారు. కాని వారికి లభించవలసిన ప్రతిఫలం (స్వర్గం) లభించాల్సి ఉంది. కాబట్టి మీరు అన్సార్లలోని సజ్జనులను ఆదరించండి. వారిలోని దుర్వర్తనులను మన్నించండి."

434-1. ఆ సహాబీ పేరు సాబిత్ బిన్ ఖైస్ లేదా అబ్దుల్లాహ్ బిన్ రవాహ లేదా అబూ తల్హా.

434-2. అంటే కంచంలో చేయి పెట్టి తాము కూడా భోజనం చేస్తున్నట్లే అభినయం చేశారు. మరోవైపు అతిథి మాత్రం కడుపు నిండా తిన్నాడు.

434-3. నవ్వటం, ఆశ్చర్యపోవటం- ఈ రెండు గుణాలు దేవునిలో ఉంటాయని హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

434-4. సుబ్‌హానల్లాహ్! ఆ దంపతుల సమయస్ఫూర్తికి జోహార్లు. మనం వేలు, లక్షలు దైవమార్గంలో ఖర్చుచేసినా ఆ భార్యాభర్తలు ఆ సమయంలో చేసిన త్యాగంతో సరితూగ లేము.

★★★




**మూలం: మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి (రహ్మ)** **అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

ఒకే ఒక వివేకవంతుని హస్తం ఈ విశ్వం వెనుక పని చేస్తోందని కూడా అది సాక్ష్యమిస్తోంది-

> **"నీటి వనరులు రెండూ సమానం కావు; ఒకటేమో తియ్యనిది, దప్పికను తీర్చేది, త్రాగటానికి మధురమైనది. రెండోదేమో గొంతు మండించే అంత ఉప్పనిది. కాని రెండింటి నుంచీ మీరు స్వచ్ఛమైన తాజా మాంసాన్ని పొందుతారు. ధరించటానికి అలంకరణ సామగ్రిని వెలికి తీసుకుంటారు. మీరు చూస్తూనే ఉన్నారు– ఈ నీటిలోనే పడవలు దాని గుండెలను చీల్చుకుంటూ పోతూ ఉంటాయి. మీరు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించేం దుకు తద్వారా ఆయనకు కృతజ్ఞులు అయ్యేందుకు. ఆయన పగలులోనికి రాత్రినీ, రాత్రిలోనికి పగలునూ జొనుపుతున్నాడు. సూర్యచంద్రులను ఆయన నియమ బద్ధులను చేసి ఉంచాడు. ఇదంతా ఒక నిర్ణీత వ్యవధి వరకు సాగిపోతోంది. (ఈ పనులన్నీ చేసే) ఆ అల్లాహ్‌యే మీ ప్రభువు, సామ్రాజ్యాధికారం ఆయనదే. ఆయనను కాదని మీరు పిలిచే ఇతరులు కనీసం ఒక గడ్డిపోచకు కూడా యజమానులు కారు."** ***(ఫాతిర్ : 12,13)***

చూశారా! ఒకవైపు ఉప్పునీటి సముద్రం, మరోవైపున తియ్యని నీరున్న నదీ ప్రవాహం. ఈ రెండింటి మధ్యన ఎంత స్పష్టమైన వైరుధ్యం! అయినప్పటికీ అవి రెండూ కలసి ఒక గొప్ప ఉమ్మడి లక్ష్యసాధన కోసం ఎలా పని చేస్తున్నాయో మీరు గమనిస్తున్నారు. మానవుడు ఏ విధంగా ఈ రెండు జలనిధుల నుండి తన ఆహారాన్ని గ్రహిస్తున్నాడో కూడా మీరు చూస్తూనే ఉన్నారు. ఏ విధంగా తన అలంకరణ కోసం ముత్యాలు పగడాలను రాబడుతున్నాడో కూడా మీరు చూస్తున్నారు. మరి ఏ విధంగా ఓడలు నీటిలో తరలిపోతూ రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నాయో, ఏ విధంగా వాణిజ్యాన్ని అభివృద్ధి చేస్తు న్నాయో కూడా మీరు గమనిస్తున్నారు. మరి మీరు రాత్రి చీకటిని, పగటి వెలుతురును గురించి ఆలోచించండి. అవి రెండూ తమ గుణాలు, ప్రత్యేకతల రీత్యా ఒండొక దానికి పూర్తిగా విరుద్ధమైనవి. కాని అవి పరస్పర విరుద్ధ స్వభావం కలిగి ఉండి కూడా ఎంతో సామరస్యంతో, మరెంతో సమ న్వయంతో ఈ జగతి మనుగడలో తమ వంతు పాత్రను బహు చక్కగా పోషిస్తున్నాయి. ఈ జగతిలో మనుషులు, పశువులు, పక్షుల, వృక్షాల సేవలో అవి నిమగ్నమై ఉన్నాయి. సూర్యుడు పగటి వేళ ఉదయిస్తాడు. తన వెలుగును, వేడినీ విరజిమ్ముతాడు. చంద్రుడు రాత్రిపూట ఉదయించి కాంతినీ, చల్లదనాన్ని సమకూరుస్తూ ఉంటాడు. చూడబోతే అవి రెండూను ఒండొక దానికి ఎంతో భిన్నమైనవి. కాని ఈ ప్రపం చంలోని ఒక్కొక్క ప్రాణి వాటి ద్వారా లబ్ధి పొందుతుంది. ఇవి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మానవ సేవలో నిత్యం నిమగ్నమై ఉన్నాయి. ఏమిటీ, ఇదంతా కాకతాళీయమా? ఈ నిర్వహణా వ్యవస్థ, ఈ నియమబద్ధత, ఈ సహకార

భావం, ప్రయోజనం చేకూర్చే ఈ గుణం- ఇవన్నీ వాటంతట అవే జరుగుతున్నాయా? వీటన్నింటినీ తిలకించిన మీదట కూడా, వీటిని యాదృచ్ఛిక సంఘటనలుగా ఖరారు చేసేవారు కేవలం తమ మనోరథం వెనుక పరుగెడుతున్నారు. వారి ఈ ధోరణికి ప్రధాన కారణం సత్యాన్ని అంగీకరించరాదన్న మంకుతనమే. జ్ఞానంతో, పరిశోధనతో వారికెట్టి సంబంధం లేదు.

# తౌహీద్ వాస్తవికత

### 3) విరుద్ధమైన దాని నుండి విరుద్ధమైనది వెలికి రావటం

అలాగే మరో పార్శ్వాన్ని గురించి కూడా ఆలోచించండి. ఈ ప్రపంచంలో ఒక విరుద్ధమైన దాని నుండి మరో విరుద్ధమైన పుట్టుక వస్తోంది. పచ్చని చెట్టు నుండి నిప్పురవ్వలు రాలుతాయి.

1) "మేమే పచ్చని వృక్షం నుండి మీ కొరకు అగ్నిని సృష్టించాము."

2) ప్రాణం లేని దాన్నుండి ప్రాణమున్న దానిని, ప్రాణమున్న దాని నుండి ప్రాణంలేని దానిని వెలికి తీసేవాడు ఆయనే. ఆయనే అల్లాహ్. మరైతే మీరు ఎటువైపు దారి తప్పి వెళుతున్నారు?

ఇటువంటి పటిష్టమైన వ్యవస్థ వెనుక తిరుగులేని ఒక శక్తి ఉందనీ, అది తన శక్తి సామర్థ్యాలతో పనిచేస్తోందనీ, పరస్పర విరుద్ధమైన వస్తువుల నుండి విరుద్ధమైన వాటినే సృష్టించి, తన సృష్టితాలకు లాభం చేకూరుస్తోందన్నది వాస్తవం కాదా? ఎవరయితే ఈ జగతిని కేవలం యాదృచ్ఛిక సంఘటనగా భావిస్తున్నారో, వారు జీవం ఉన్న దాన్నుండి నిర్జీవాన్ని, నిర్జీవమైన దాన్నుండి జీవమున్న దానిని వెలికి తీయటానికి ఇచ్చే సమాధానం ఏమిటి? పచ్చని చెట్టు నుండి- తాజా పండ్లు ఫలాల స్థానంలో- నిప్పు రవ్వలు రాలటంపై వారిచ్చే సంజాయిషీ ఏమిటి?

### 4) ఒకే రకమయిన దాని నుండి విభిన్నమైన వస్తువుల ఉనికి

దీనినే పోలిన మరో యథార్థం కూడా ఉంది. ఒకే రకమయిన వాటి నుండి వివిధ వస్తువులు ఉత్పన్నం కావటాన్ని మనం గమనిస్తున్నాము. ఈ జగతి ఆరంభంలో పరచబడిన ఒకే వస్తువుగా ఉండేదని, ఆ తరువాత క్రమక్రమంగా దాని వివిధ భాగాలు జనించాయని సైన్సు అంటోంది. ఇది నిజమైతే, ఈ నిజాన్ని కాదనడానికి తగు కారణమేదీ లేదని అనేటట్లయితే, మరి ఈ విభజన లేక పంపకం చేసే వాడున్నాడొకడున్నాడనీ, ఆయన ఒకటిని రెండుగా, రెండును నాలుగుగా చేస్తున్నాడని అవశ్యంగా ఒప్పుకోవలసి ఉంటుంది. ఇక్కడి నుండే ఎన్నో ప్రశ్నలు జనిస్తాయి. భూమి ఒక్కటే. నీరు ఒక్కటే. వీచే గాలులు కూడా ఒకే తరహాకు చెందినవి. కాని ఆ భూమిలో మొలకెత్తే మొక్కలు, తీగలు అసంఖ్యాకం. పువ్వుల రంగులు వేరు. పండ్ల ఆకృతులు, వాటి పరిమాణం, వాటి రంగులు, రుచులు, వాసనలో వైవిధ్యం ఉంది. ఒకే టెంక నుండి ఒక్కోసారి విభిన్న రకాల వృక్షాలు మొలకెత్తుతాయి. వాటి కాండాలు, శాఖలు కూడా విభిన్నంగా ఉంటాయి.

> **"చూడండి! భూమిలో వేర్వేరు ప్రదేశాలు ఉన్నాయి. అవి ఒకదానికొకటి ప్రక్కప్రక్కన ఉన్నాయి. ద్రాక్ష తోటలూ ఉన్నాయి, పంటపొలాలూ ఉన్నాయి, ఖర్జూరపు చెట్లూ ఉన్నాయి- వాటిలో కొన్ని ఒక్కొక్కటిగానూ మరికొన్ని జంటలుగానూ ఉన్నాయి- వాటన్నింటికీ ఒకే నీరు పారు తోంది. కానీ మేము కొన్నింటిని ఎక్కువ రుచికరమైనవిగా చేశాము. మరి కొన్నింటిని తక్కువ రుచికరమైనవిగా చేశాము. ఈ అన్ని విషయాలలోనూ బుద్ధిని ఉపయోగించే వారికి చాలా సూచనలు ఉన్నాయి.** *(అర్రాద్: 4)*

విజ్ఞత, వివేచన కల వ్యక్తికి ఇందులో హెచ్చరిక ఉంది. అతను ప్రతి వస్తువు రంగుపై, పండ్లుఫలాల రంగుపై, రుచిపై చింతన చేస్తాడు. వీటి వెనుక ఒక సృష్టికర్త ఉన్నాడనీ, ఆయన ఎంతో యుక్తితో, దయతో వీటిని ఉనికిలోనికి తెస్తున్నాడన్న నిర్ణయానికి వస్తాడు. ఆ సృష్టికర్త ఒకే ఒక్కడని, ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరని అతనికి అవగతం అవుతుంది. ఎందుకంటే ఈ చెట్లు ఒకే నీటిని పీలుస్తున్నాయి. ఒకే భూభాగం నుండి మొలకెత్తిన వృక్షాలలో అపురూపమైన వైవిధ్యం ఉంది. అయినప్పటికీ మనం నీటిలో, నేలలో వ్యత్యాసం, వైవిధ్యం ఉందని అనము. అలాంటప్పుడు జగతిలో విస్తరించి వున్న రంగురంగుల వృక్షజాలను అనేక మంది దేవుళ్ళ పనితనానికి నిదర్శనంగా ఎలా చెప్పగలము? అదీగాక ఇక్కడ స్పష్టమయ్యే మరో విషయమేమిటంటే, ఈ రంగురంగుల విభిన్న వస్తువుల వెనుక ఏ గుడ్డివాడో, చెవిటివాడో లేడు. పైగా అన్నీ తెలిసినవాడు, అసాధారణ శక్తిసామర్థ్యాలు కలవాడు ఒక నిర్ణీత అంచనా ప్రకారం వీటిని ఉనికిలోకి తెచ్చాడు. వాటి మధ్యన ఏదేని విషయంలో హెచ్చు తగ్గులు చేసినా, అది కూడా తన యుక్తిననుసరించే చేశాడు. ✤




**దేశంలో** ఇప్పుడు గోదీ మీడియా అనే పదం చాలా ప్రాచుర్యం పొందింది. మోదీ సర్కారు భజన చేయడమే ఈ చానళ్ళ పనిగా మారింది. ఈ చానళ్ళలో పనిచేసే కొందరు యాంకర్లు కూడా గోదీ యాంకర్లుగా పేరుమోసారు. ఇలాంటి కొందరు యాంకర్లను కొంతకాలం క్రితం ఇండియా కూటమి నిషేధించింది. అలా బ్యాన్‌కు గురైన యాంకర్లలో ఒక యాంకర్ పేరు నావికా కుమార్. అలాంటి నావికా కుమార్‌కు ఇప్పుడు హఠాత్తుగా జర్నలిజం గుర్తొచ్చినట్లుంది. అనూహ్యంగా ఆమె గొప్ప ధైర్యం చూపిస్తూ ఆర్థికమంత్రి నిర్మాలా సీతారామన్‌ను సూటిగా నిలదీసే ప్రశ్నలు అడిగారు. ఈ ఇంటర్వ్యూ తర్వాత నావికా కుమార్‌ను జర్నలిస్టుగా చాలా మంది మెచ్చుకుంటుంటే, నిర్మాలా సీతారామన్‌ను చాలా మంది విమర్శిస్తున్నారు. ఈ ఇంటర్వ్యూ నిర్మలా సీతారామన్‌ను పూర్తిగా ఎక్స్‌పోజ్ చేసింది.

నావికాకుమార్ అడిగిన ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. నేడు దేశంలో ప్రతి ఒక్కరు బీజేపీని అడగాలనుకుంటున్న ప్రశ్నలివి. నిజానికి ఈ ప్రశ్నలనే ప్రతిపక్ష నేతలు ఎప్పటి నుంచో అడుగుతున్నారు. వాషింగ్ మెషిన్ తమ వెంట తీసుకువెళ్ళి డిమాన్‌స్ట్రేషన్లు చేసి మరీ అడుగుతున్నారు. ఇవే ప్రశ్నలను నావికా కుమార్ అడిగింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ప్రశ్నలకు సిగ్గు శరం లేకుండా, మేం ఏమైనా చేస్తాం అన్నట్లు ఇచ్చిన జవాబులు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. బీజేపీ నిజరూపాన్ని అందరి ముందుకు తీసుకువచ్చిన ఇంటర్వ్యూగా ఇది మారింది. నావికా కుమార్ అడిగిన ప్రశ్నలేమిటో చూద్దాం. మొదటి ప్రశ్న:

ఇద్దరు ముఖ్యమంత్రులు కటకటాల వెనక ఉన్నారు. ఈడీని ఎదుర్కోవడం ప్రతిపక్షాలకు చాలా కష్టంగా మారింది. కాని అవినీతి పరులుగా ముద్రపడిన నాయకులు బీజేపీలోకి పరుగెత్తుకుని వస్తున్నారు. ఇదంతా చూస్తుంటే బీజేపీ దేశంలో రిజర్వు పొలిటికల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మారిందా అనిపిస్తోంది. మీకు ఎన్నికల్లో పోరాడ్డానికి ఇతర పార్టీల నాయకులు అవసరమవుతున్నారు.

ఇది నావికా కుమార్ అడిగిన ప్రశ్న. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ప్రశ్నకు జవాబిచ్చే బదులు ఈ ప్రశ్నను ఎగతాళి చేస్తున్నట్లు, జోక్ చేస్తున్నట్లు జవాబిచ్చారు. ఆ జవాబేమిటంటే,

చాలా ఆసక్తికరమైన ప్రశ్న. ఈ ప్రశ్నపై ఈ రాత్రి 9 గంటలకు మీరు చర్చా కార్యక్రమం పెట్టాలి. ఈ జవాబుకు అడిగిన ప్రశ్నకు సంబంధమే లేదు. చాలా మంది ప్రతిపక్షనేతలు అడుగుతున్న ప్రశ్నే నావికాకుమార్ అడిగింది. ఒక సీరియస్ ప్రశ్నకు

జవాబివ్వకుండా వేళాకోళం చేస్తూ, జోకులాంటి జవాబివ్వడం బీజేపీ నేత నిర్మాలా సీతారామన్‌కే చెల్లింది. కాని నావికా కుమార్‌కు ఈ ఇంటర్వ్యూలో ఏమయ్యిందో ఏమో కాని చాలా కాలంగా మరిచిపోయిన జర్నలిజం ఒక్కసారి ఆమెలో మేల్కొంది. నిర్మలా సీతారామన్‌ను ఆమె అంతటితో వదిలిపెట్టలేదు. నిర్మలా సీతారామన్ వేళాకోళాలు, జోకులను ఆమె పట్టించుకోలేదు. సూటిగా ఇంకో ప్రశ్న అడిగింది.

మీరు కరప్షన్ చాంపియన్ అని విమర్శించిన వాళ్ళు, ఆరోపించిన వాళ్ళు ఇప్పుడు బీజేపీలోకి వచ్చేశారు. కార్గిల్ యుద్ధ కుంభకోణం ఆరోపణలున్న అశోక్ చవాన్ మీ పార్టీలోకి వచ్చేశాడు. అజిత్ పవార్‌ను జైలుకు పంపిస్తామన్నారు. 70 వేల కోట్ల కుంభకోణం. ఇప్పుడతను కూడా బీజేపీలోకి వచ్చేశాడు. ఇప్పుడాయన జైలుకు పోయేదిలేదు, పైగా అభివృద్ధికి మారుపేరుగా మారిపోయాడు. అసలు అభివృద్ధిపై రాజకీయాలు ఎప్పుడు ప్రారంభమవుతాయి, హిపోక్రసీ రాజకీయాలు ఎప్పుడు అంతమవుతాయి.

ఇది నావికా కుమార్ రెండో ప్రశ్న. ఈ ప్రశ్నకు నిర్మాలా సీతారామన్ ఇచ్చిన జవాబు బీజేపీ డొల్లతనానికి గొప్ప ఉదాహరణగా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నిర్మలా సీతారామన్ ఏమన్నారంటే -

నిజానికి ఇప్పుడు జరుగుతున్నదే అభివృద్ధి రాజకీయం. భవిష్యత్తులో కూడా ఇలాగే జరుగుతుంది. దీన్నెవరు మార్చలేరు. బీజేపీలోకి అందరికీ స్వాగతం. రాజకీయాల్లో ఉన్నవాళ్ళు బీజేపీని చూసి, బీజేపీ అసలైన సమస్యలపై పోరాడుతుందని భావించి పార్టీలోకి రావాలనుకుంటే వారికి స్వాగతం. కాని పార్టీ వాల్యూ సిస్టమ్ ఎప్పుడు పనిచేస్తున్నట్లే పనిచేస్తుంది. సిద్ధాంతాల విషయంలో రాజీ లేదు.

ఈ జవాబును ఎలా అర్థం చేసుకోవాలో జుట్టుపీక్కున్నా ఎవరికి అర్థం కాదు. ఒకవైపు ఆమె అవినీతిపరులైనా ఎవరైనా సరే పార్టీలోకి స్వాగతం అని చెబుతూ, సిద్ధాంతాల విషయంలో రాజీలేదని చెప్పడమేమిటి? అసలు బీజేపీ సిద్ధాంతమేమిటి? ఇదంతా పెద్ద అయోమయం, గందరగోళం అనుకున్న నావికా కుమార్ పాపం మరోసారి ఇదే ప్రశ్న అడిగి కాస్త సూటిగా జవాబు సంపాదించా లనుకుంది. ఆమె అడిగిన మూడో ప్రశ్న

అవినీతిపరులైన నాయకులకు రెడ్ కార్పెట్ పరిచి స్వాగతించడం బీజేపీలో కొనసాగుతూనే ఉంటుందా అని సూటిగా ప్రశ్నించింది.

ఈ ప్రశ్నకు నిర్మాలా సీతారామన్ ఇచ్చిన జవాబు సిగ్గులేని తనానికి పరాకాష్ఠ. ఆమె ఇచ్చిన జవాబు-

అవును, ఇలాగే జరుగుతుంటుంది. మా పార్టీలోకి అందరికి స్వాగతం. పార్టీ తలుపులు అందరి కోసం తెరిచి ఉన్నాయి.

ఈ జవాబు విని బహుశా నావికా కుమార్ తల తిరిగిపోయి ఉంటుంది. ఇంత నిర్లజ్జగా అవినీతిపరులను ఆహ్వానిస్తామంటా రని బహుశా ఆమె ఊహించి కూడా ఉండదు. ఈ జవాబుతో తల తిరిగిన నావికా కుమార్ మరోసారి ఇదే ప్రశ్న కాస్త మార్చి ఇంకో రకమైన జవాబు వస్తుందేమో ట్రయ్ చేసింది. బహుశా నావికా కుమార్‌కు మోడి కేబినేట్‌లోని ఒక మంత్రి ఇంత బాహాటంగా అవినీతిపరులైనా సరే పార్టీలోకి స్వాగతం అని చెప్పడం నమ్మశక్యం కాలేదు. తన చెవులపై నావికా కుమార్‌కు అనుమానం వచ్చింది. తన చెవులు తనను మోసం చేస్తున్నాయేమో అన్న అనుమానంతో అదే ప్రశ్న మరోసారి తిరగేసి అడిగింది. మరోసారి నిర్మాలా సితారామన్ ఎలాంటి సంకోచం,సిగ్గు, లజ్జ లేకుండా ఎవరికైనా పార్టీలోకి ఘనస్వాగతం అని చెప్పింది.

ఇది పరిస్థితి. ఒకవైపు ప్రధాని మోదీ ర్యాలీల్లో అవినీతి పరుల అంతు చూస్తామని, అవినీతి పరులను జైలుకు తరలిస్తామని అంటున్నారు. మరోవైపు అవినీతి నేతలు బీజేపీలోకి క్యూ కడుతున్నారు. బీజేపీలోకి రాగానే వారిపై కేసులు మంచుగడ్డల్లా కరిగిపోతున్నాయి. నిర్మలా సీతారామన్ వంటి అగ్రశ్రేణి నేతలే స్వయంగా తమ పార్టీలోకి ఎవరికైనా ఇలాగే స్వాగతం పలుకు తామని గర్వంగా చెప్పుకుంటున్నారు. ఈ మొత్తం ఇంటర్వ్యూలో రెండు అనూహ్యమైన సంఘటనలున్నాయి. ఒకటి గోదీ యాంకర్‌గా పేరుపడిన నావికా కుమార్‌కు హఠాత్తుగా జర్నలిజం గుర్తుకువచ్చి, ఒక మంత్రిని నిలదీసి ప్రశ్నించడం అనూహ్యం నెంబర్ వన్. చాలా చాకచక్యంగా మాట్లాడే నేతగా పేరున్న నిర్మలా సీతారామన్ ఇంత బాహాటంగా, నిర్లజ్జగా అవినీతిపరులైనా సరే ఎవరైనా సరే తమ పార్టీ తలుపులు తెరిచి ఉంటాయని చెప్పడం అనూహ్యం నెంబర్ టూ. కాని ఈ అనూహ్యమైన సంఘటనల ఇంటర్వ్యూ తర్వాత బీజేపీ నేతలకు అవినీతిపై మాట్లాడే నైతిక అర్హత ఉందా? గమనించదగిన మరో విషయమేమిటంటే, నావికా కుమార్ ఈ ప్రశ్నలు అడుగుతున్నప్పుడు అక్కడ కూర్చున్న జర్నలిస్టులు చప్పట్లు కొడుతూ ఆమెను ప్రోత్సహించడం. ఈ సంఘటనలు మారుతున్న మీడియా ముఖచిత్రానికి సంకేతాలుగా భావించగలమా? వేచి చూద్దాం.

# ఇద్దరు అమెరికన్ కవులు
# ఎడ్గర్ అండ్ ఎడ్విన్

సబా

**పందొమ్మిదవ శతాబ్ది ప్రథమార్థంలో అద్భుతమైన కవిత్వం రాసిన ఈ ఇద్దరు కవులు సమకాలీనులు. ఇందులో ఒకరు ఎడ్గర్ లీ మాస్టర్, మరొకరు ఎడ్విన్ ఎర్లింగ్టన్ రాబిన్సన్.**

## ఎడ్గర్ లీ మాస్టర్స్ (1868-1950)

ఎడ్గర్ లీ మాస్టర్స్ అమెరికన్ కవుల్లో సైకాలజికల్ కేరక్టర్ స్టడీని మరింత ముందుకు తీసుకువెళ్ళిన కవి. కల్పిత పాత్రల మానసిక రూపాన్ని అక్షరాల్లో ఆవిష్కరించిన కవి. 1915లో మాస్టర్స్ రాసిన "స్పూన్ రివర్ ఆంథాలజీ" దీనికి మంచి ఉదాహరణ. ఇందులో కవితలన్నీ వచన కవితలే. అయితే శబ్దపరమైన సౌందర్యం విషయంలో మాస్టర్స్ రాజీ పడలేదు. ఈ కవితలన్నీ స్పూన్ రివర్ నది ఒడ్డున ఒక కల్పిత గ్రామం "స్పూన్ రివర్"లో నివసించిన కల్పిత పాత్రల గురించినవి. ప్రతి కవిత నిజానికి ఒక ఎపిటాఫ్. అంటే మరణించిన వ్యక్తి గురించి అతని సమాధిపై రాసే పరిచయ పంక్తుల వంటిది. ఇందులో మొత్తం 212 ఇలాంటి కల్పిత పాత్రల కథనాలున్నాయి. రీడీ మిర్రర్ పత్రికలో మొదట ఈ కవితలన్నీ అచ్చయ్యాయి. తర్వాత ఒక సంకలనంగా వచ్చాయి. మొదటి కవిత "ది హిల్" నిజానికి ఒక ప్రవేశిక వంటిది. అనేక పాత్రల పేర్లను ప్రస్తావిస్తూ, వారంత ఏమయ్యారని అడుగుతూ, అందరూ కొండపై ప్రశాంతంగా శాశ్వత నిద్రలో ఉన్నారని చెబుతాడు. ఆ తర్వాత వచ్చే కవితలన్నీ వివిధ కల్పిత పాత్రల కథనాలు. మానవ సంబంధాలు, అందులోని సంక్లిష్ట కోణాలు ఈ కథనాల్లో అత్యంత ఆర్ధ్రంగా చిత్రించాడు. ఉదాహరణకు ఒక గొప్ప వ్యక్తి తాను సాధించిన విజయాలన్నింటికి కారణం తన తల్లిదండ్రులే అని వారిని కీర్తిస్తాడు. ఇది వింటూ ఒక ముసలి మహిళ మౌనంగా రోదిస్తుంటుంది. ఎందుకంటే ఆ వ్యక్తి ఆమెకు అక్రమసంతానం కాబట్టి.

మాస్టర్స్ స్వరంలో కరకుదనం, నిరాశ, ఒకవిధమైన పశ్చాత్తాప భావం వినబడుతుంటాయి. ఆ తర్వాత కూడా మాస్టర్స్ రాసిన అనేక కవిత్వ సంపుటుల్లో ఇదే స్వరంతో కూడిన మోనాలాగ్స్ వంటి కవితలే ఉన్నాయి. ఇంగ్లీషు రోమాంటిక్ కవుల (కాల్పనిక కవులు) ప్రభావం ఈయనపై ఉన్నట్లు కనిపిస్తుంది. వర్డ్స్ వర్త్, కీట్స్, షెల్లీ, బ్రౌనింగ్, రాల్ఫ్ వాల్డో ఎమర్సన్, వాల్ట్ విట్మాన్‌ల ప్రభావం ఈయన రచనలపై ఉంది.

మాస్టర్స్ ఏ వాదం వైపునకు మొగ్గు చూపలేదు. తనదైన స్వతంత్ర శైలిని కొనసాగించాడు. సంక్లిష్టమైన కవిత్వీకరణపై ఆయన ఆసక్తి లేదు. నిత్యజీవితంలోని సహజమైన సత్యాలపైనే దృష్టి నిలిపాడు.

కంసాస్‌కు చెందిన మాస్టర్స్ పీటర్స్ బర్గ్, లూయిస్టౌన్, ఇల్లీనాయిస్లలో పెరిగాడు. స్పూన్ రివర్ దగ్గర్లోనే ఆయన బాల్యం గడిచింది. బాల్యం కాస్త కష్టాల్లోనే గడిచింది. కొంతకాలం రిపోర్టరుగా, ప్రింటింగులో హెల్పరుగా పనిచేశాడు. పత్రికలకు రచయితగా కూడా పనిచేశాడు. తండ్రికి సాహిత్యము, కవిత్వం పట్ల పెద్ద ఆసక్తి లేదు. కొడుకును న్యాయవాది చేయాలనుకున్నాడు. తండ్రి కోరికపై న్యాయవాద విద్యను అభ్యసించాడు. న్యాయవాదిగా రాణించాడు. కవిత్వంలో పాత్రల మానసిక చిత్రణ పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టిన మాస్టర్స్ తర్వాత న్యాయవాద వృత్తిని పూర్తిగా విడిచిపెట్టి కవిత్వానికే తన పూర్తి సమయాన్ని కేటాయించాడు. ఆయన రాసిన స్పూన్ రివర్ ఆంథాలజీలో ఒక కవిత చూడండి:

## ఏబెల్ మెల్వనీ

"నాకు తెలిసిన ప్రతి మెషీన్ నేను కొన్నాను
గ్రయిండర్లు, షెల్లర్లు, ప్లాంటర్లు, మూవర్లు
మిల్లులు, రేకులు, ప్లోలు, థ్రెషర్లు... అన్నీ
అవన్నీ ఇప్పుడు ఎండలో, వానలో పడి ఉన్నాయి
తుప్పుపట్టి, దుమ్ముపట్టి ....
వాటిని దాచి ఉంచే షెడ్డులేవీ నా వద్ద లేవు...
అసలా మెషీన్లు వాడే అవసరం కూడా ఏదీ నాకు లేదు
చివరకు, అంతా అయిపోయిన తర్వాత
కిటికీ నుంచి స్పష్టంగా చూస్తూ...
నా నాడి మందగిస్తున్నప్పుడు
నేను కొన్న ఆ మెషీన్లలో ఒక దాన్ని చూస్తూ...
దాన్ని వాడే అవసరం నాకెన్నడూ కలగలేదు
నాతో నేను అనుకున్నాను
ఒక మంచి యంత్రం.. ఒకప్పుడు చక్కని రంగుతో మెరిసేది
తన పని చేయడానికి సిద్ధంగా ఉండేది
ఇప్పుడు రంగు వెలిసిపోయింది
నేను కూడా ఒక మంచి మెషీన్ లాగే ఉన్నాను
జీవితం ఎన్నడూ ఉపయోగించని మెషిన్ని నేను".

## ఎడ్విన్ ఎర్లింగ్టన్ రాబిన్సన్ (1869-1935)

అమెరికన్ కవి ఎర్లింగ్టన్ రాబిన్సన్ గురించి చెప్పే ముందు ఆయన రాసిన అద్భుతమైన కవిత "ల్యూక్ హావర్గాల్" తప్పక చదవాలి. 1896లో ఈ కవిత రాశాడు. అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్వెల్ట్ ఈ కవితకు అభిమానిగా మారిపోవడమే కాదు, రాబిన్సన్ కు కేవలం ఈ ఒక్క కవిత ప్రభావంతో ఎంతో సహాయం కూడా చేశాడు. రాబిన్సన్ రాసిన ఆ కవిత చూద్దాం.

పడమటి గుమ్మం వైపు వెళ్ళు, ల్యూక్
అక్కడ ద్రాక్షతీగలు గోడ మీది ఎరుపు వర్ణాన్ని కావలించుకున్నాయి
మసక సంధ్యలో ఏమవుతుందో చూడు
అక్కడ ఆకులు ఆమె కోసం గుసగుసలాడుతాయి. మరి కొన్ని,
ఎగురుతున్న పదాల్లా, అవి నేలరాలినప్పుడు నిన్ను తాకుతాయి
అయినా వెళ్ళు, నువ్వు వింటే, ఆమె నిన్ను పిలుస్తుంది.
పడమటి గుమ్మం వద్దకు వెళ్ళు ల్యూక్.
లేదు, తూర్పు ఆకాశంలో పొద్దుపొడుపేదీ లేదు
నీ కళ్ళల్లో మండుతున్న రాత్రిని ఛేదించే
పొద్దుపొడుపేదీ లేదు
కాని అక్కడ, పడమటి విషాదాలు పొగుపడుతున్న చోట
చీకటిని, ఏదీ కాకపోయినా చీకటే అంతం చేస్తుంది
ఇది చెప్పడానికే సమాధి నుంచి వచ్చాను నేను
ముద్దును ఆర్పడానికే సమాధి నుంచి వచ్చాను నేను
అది, నీ నుదుటిపై ఒక కాంతితో మండుతోంది
నువ్వు వెళ్ళవలసిన దారి కనబడకుండా గుడ్డివాణ్ని చేస్తుంది
ఉంది, ఆమె ఎక్కడ ఉందో, ఆ దారి ఒకటి ఉంది.
కఠినమైనా, నమ్మకం ఎన్నటికీ నిరాశపరచని దారి
ఇది చెప్పడానికే సమాధి నుంచి వచ్చాను నేను
నీకు చెప్పడానికే...
ఇక్కడుంది పడమటి గుమ్మం, ల్యూక్
ఇక్కడ గోడలపై ముదురు ఎరుపు ఆకులు
వెళ్ళు, గాలులు వాటిని చింపి వేస్తున్నాయి
అవి చెప్పే చనిపోయిన మాటల అంతరార్థాల గురించి ఆలోచించకు
అవి కిందపడుతున్నప్పుడు వాటి స్పర్శ కోసం పట్టించుకోకు
వెళ్ళు, నువ్వు ఆమెను నమ్మితే, ఆమె నిన్ను పిలుస్తుంది.
ఇక్కడుంది పడమటి గుమ్మం, ల్యూక్

ఈ మొత్తం కవితలో మూడ్ "వెంటాడే" మూడ్. ఒక ప్రేమికుడు. అతను ప్రేమించిన అమ్మాయి చనిపోతే, ఆమెను కలవడానికి తీవ్రమైన నిరాశతో మాట్లాడే మాటలివి. సమాధి నుంచి వినిపిస్తున్న ఒక గొంతు అతన్ని ఆత్మహత్యవైపు పురిగొల్పుతున్న ధ్వని కవితలో వినిపిస్తుంది. ఈ కవితలోని భావం చాలా మార్మికమైందని అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్వెల్ట్ భావించేవాడు. రాబిన్సన్ ఈ కవితలో కాస్త మార్మికతను రాసినా, నిజానికి ఈ కవిత విషాద మృత్యు ముఖాన్ని చూపించే కవిత. మరీ నిగూఢంగా కూడా కవితలోని భావాలు లేవు. కవితలో వాడిన ప్రతీకలు, రంగులు, నిజానికి శబ్దం, దృశ్యాల మాధ్యమంతో పాఠకుడిని ఒక తీవ్రమైన విషాదంలోకి నడిపిస్తాడు. మరణించిన తన ప్రేయసి పట్ల ప్రేమతో పిచ్చివాడిగా మారిపోయిన ప్రేమికుడు తన ప్రాణాలను కూడా తీసుకునే ఆలోచనలే ఈ కవితలో ఉన్నాయి.

ఈ కవితలో థీమ్ గ్రహించడం పెద్ద కష్టమేమీ కాదు. ఎరుపు రంగును రక్తానికి, మృత్యువుకు ప్రతీకగా ఉపయోగించాడు. మసకసంధ్య అనే పదం కూడా అలాంటి ప్రతీకయే. తూర్పు ఆకాశంలో ఒక్క పొద్దు పొడుపు కూడా లేదనడం తీవ్రమైన నిరాశను ప్రతిబింబించింది. "పడమటి విషాదాలు" అనడం ఒక అస్తమయాన్ని సూచించే విషాదాలు. ఇవన్నీ కవితలో థీమ్ మృత్యువన్నది స్పష్టంగా తెలుపుతున్నాయి.

ఒక ప్రేమికుడి నిరాశను మార్మికతతో కూడిన తీవ్రమైన విషాద స్వరంతో వినిపించిన ఈ కవిత రాబిన్సన్‌కు చాలా పేరు సంపాదించి పెట్టింది.

# బడుగు బలహీనవర్గాల జీవితాల్లో వెలుగు నింపుతున్న కోనేరు



నల్లమల అటవీ ప్రాంతాల్లోని గ్రామాలలో అందరికీ విద్య, ఆరోగ్య పరిరక్షణ కోసం కోనేరు సంస్థ కృషి చేస్తుందని సంస్థ అధ్యక్షుడు ఎం.ఎ సలీమ్ తెలియజేశారు.

బడులే లేని పల్లెటూళ్ళలో కార్యకర్తలను నియమించి పిల్లలు చదువుకునే ఏర్పాట్లు చేశామని అన్నారు. దళిత, గిరిజన బలహీన వర్గాల యువతలో విద్యపై ఆసక్తి కల్పించి కూలి పని చేస్తున్న 3000లకు పైగా పిల్లలను బడుల్లో చేర్పించామన్నారు.

పొదుపును ప్రోత్సహిస్తూ చైతన్య వికాస్ మహిళా సమాఖ్యను రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేశామని, చెంచుల్లో 500 మంది తేనె సేకరణదారులకు దశలవారీగా శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇచ్చామన్నారు. గుత్తికోయల జీవనోపాది మెరుగుపరచడానికి, వారి పిల్లల చదువులకు కృషి చేస్తున్నామని చెప్పారు. రంగారెడ్డి, మహబూబ్ నగర్, వికారాబాద్ జిల్లాలలోని అడవి పరిసర పల్లెల్లో జీవిస్తున్న చెంచుల హక్కుల పరిరక్షణకు గిరిజన శాఖతో కలిసి పనిచేస్తున్నామని వివరించారు.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# పవిత్ర రమజాన్ తర్వాత మన జీవనం

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**తీవ్ర ఎండాకాలంలో అతి పవిత్ర రమజాన్ ముగిసింది.** ఈ మహత్తరమైన మాసంతో మనలో ఏమైనా మార్పు వచ్చిందా లేదా ఆలోచించాలి. మార్పు రాలేదంటే ఇలాంటి రమజాన్‌లు మన జీవితంలో వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. మన మృత్యువు మనకు దగ్గరవుతూ ఉంటుంది.

మన నడవడికలో, మాట్లాడే పద్ధతిలో, ఇచ్చుపుచ్చుకోవడంలో, వ్యాపారంలో, ఉద్యోగంలో చాలా జాగ్రత్తగా ఉండడానికి ప్రయత్నం చేశాము.

పెద్దవారితో మర్యాద పూర్వకంగా ఉండటం, పిల్లలతో సంతోషంగా మెలగడం, వారికి సరైన బాటలో నడిపించడం, బంధుత్వాలను నెరవేర్చటం, ఇరుగు పొరుగు వారితో కలిసిమెలిసి ఉండటం, స్నేహితులతో మంచిగా ప్రవర్తించడం, పేదవారికి, అనాథులకు, బాటసారులకు, వితంతువులకు, ఖైదీలకు అన్ని విధాలుగా ఆదుకోవడం జరిగింది. ఆకలితో ఉన్న వారికి ఆహార పదార్థాలు, బట్టలు లేనివారికి బట్టలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి డబ్బుల ద్వారా గాని, మందులు ఇచ్చి ఆదుకోవడం జరిగింది.

జకాత్, ఫిత్రా, సదఖాకు అర్హులైన వారికి ఇచ్చి కొంతైనా సహాయం చేసినవారైనాము, ఇహపర సాఫల్యం పొందటానికి ఐదుపూటల నమాజ్‌తోపాటు తరావీహ్ నమాజ్, తహజ్జుద్ నమాజ్‌ను స్థాపించాము. సున్నత్, నఫిల్ నమాజులను సైతం చేశాము. రమజాన్ మాసంలో అవతరించబడిన అంతిమ దివ్య ఖుర్ఆన్ గ్రంథాన్ని ఎంతో శ్రద్ధతో పఠించాము. తర్జుమాతో చదివాము. దానిని అర్థం చేసుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నం చేశాము. ఇతరులకు చేరడానికి కృషి చేశాము.

సెల్‌ఫోన్, టెలివిజన్, ఇంటర్నెట్, పలికిమాలిన మాటలతో, చెడు అలవాట్లు అన్నీ వదిలి దైవారాధనలో ఎక్కువ సమయాన్ని కేటాయించి అల్లాహ్ మెప్పు పొందటానికి శత విధాలుగా ప్రయత్నం చేశాము.

దివ్య ఖుర్ఆన్ గ్రంథంతోపాటు హదీస్ గ్రంథాలు, దైవప్రవక్తల జీవిత పుస్తకాలు చదివాము. లైలతుల్‌ఖద్ర్ కోసం (మహోన్నతమైన రాత్రి) బేసిరాత్రులలో (21, 23, 25, 27, 29) అన్వేషించాము.


షవ్వాల్ నెలవంకను చూసి లైలతుల్ జయిజా చేసుకున్నాము. దానధర్మాలు చేసి ఈదుల్ ఫిత్ర్ (పండుగ రోజు) నాడు సంతోషంగా, ఆనందంగా, ఉల్లాసంగా, కొత్తబట్టలు ధరించి ఈద్గాలో లేదా పెద్ద మసీదులో నమాజును స్థాపించాము.

బంధువులను, ఇరుగుపొరుగు వారికి, మిత్రులను, ముస్లిమేతరులను ఇంటికి పిలిపించి షీర్‌ఖుర్మాను అందించాము. సమాజంలో మంచి వాతావరణాన్ని కల్పించాము.

రమజాన్ మాసం ఆధ్యాత్మిక జీవన సరళికి ఒక రీచార్జింగ్ బ్యాటరీ వంటిది. దీనివల్ల రాబోయే సంవత్సరానికి అవసరమయ్యే ఆధ్యాత్మిక శక్తి రీచార్జి అవుతుంది. ఒక ఆదర్శప్రాయమైన జీవన విధానాన్ని, చక్కని క్రమశిక్షణా విధానాన్ని రమజాన్ మాసంలో కాక మరే మాసంలో పొందగలం?

మన దురలవాట్లను, మన దుష్ప్రవర్తనలను, అల్లాహ్ అభీష్టానికి వ్యతిరేకంగా చేసే పనులను మార్పు చేసుకునేందుకు ప్రత్యేకించబడిన మాసం రమజాన్ మాసం.

ఒక ముస్లిం ఎడతెగకుండా అల్లాహ్ దాస్యంలోనే నిమగ్నమవ్వాలి. అల్లాహ్ ఆయన ప్రవక్త(స) సూత్రాలను స్థిరంగా అనుసరిస్తూ మరణపు చివరి ఘడియ ఆసన్నమైనంత వరకూ అనుసరిస్తూ ఉండాలి.

**మోడీ** ప్రధానిగా భారతదేశాన్ని 'విశ్వ గురువు' చేసేశారని బీజేపీ నేతలు ఎంత చెప్పుకున్నా, ఎంత ప్రచారం చేసినా దేశంలో కనిపిస్తున్న వాస్తవాలు, బీజేపీ విధానాల వల్ల తలెత్తు తున్న పరిస్థితులు, బీజేపీ ప్రభుత్వ పని తీరును, విశ్వగురు అనే ప్రచార పటాటో పాన్ని వెక్కిరిస్తూనే ఉన్నాయి. ప్రాచీన భారత వైభవం, ప్రాచీన కాలంలో భారతదేశమే ప్రపంచానికి జ్ఞాన కేంద్రం అనే ఇమేజ్ బిల్డింగ్ కోసం నూతన విద్యా విధానం వంటివి తీసుకువచ్చినప్పటికీ దేశంలోని భిన్నత్వంలో ఏకత్వం బీజేపీ తీసుకుంటున్న చర్యల వల్ల నష్టపోతున్నది.




అంతర్జాతీయంగా, భారతదేశాన్ని బలమైన దేశం అనే ఇమేజ్ సంపాదించడానికి మోడీ నిస్సందేహంగా చురుకుగా పని చేశారు. కాని సాధించింది ఏమిటి? మానవహక్కులు, అసమ్మతి గొంతు నులమడం, విమర్శలను అణిచేయడం, కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ఆయుధాలుగా వాడుకోవడం, ప్రతిపక్షాలను తొక్కేయడం మొదలైన విషయాలపై విదేశాల్లో విమర్శలు పెరుగు తున్నాయి. భారతదేశంతో మంచి సంబంధాలున్న అగ్రరాజ్యం అమెరికా కూడా ఇప్పుడు నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది.

ఇటీవల ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం బీజేపీ నిరంకుశ ధోరణులకు నిదర్శనంగా మారింది. ప్రజాస్వామ్య విలువల పట్ల బీజేపీకి ఏ మాత్రం గౌరవం లేదని చాటి చెప్పిన సంఘటనలు ఇలాంటివి చాలా ఉన్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విషయంలో "న్యాయమైన, పారదర్శక మైన, సమయబద్ధమైన న్యాయ ప్రక్రియ" ఉండాలంటూ అమెరికా చేసిన వ్యాఖ్య అంతర్జాతీయంగా భారతదేశంపై ఒత్తిడిని పెంచిన వ్యాఖ్య. బీజేపీ పాలనలో మంటగలుస్తున్న మానవ హక్కుల వాస్తవాలపై అంతర్జాతీయ ప్రతిస్పందనలు బీజేపీ నేతలు చేస్తున్న విశ్వగురు ప్రచారంలో డొల్లతనాన్ని బయటపెడుతున్నాయి. నైతికంగా, ఆధ్యాత్మికంగా, జ్ఞానపరంగా ప్రపంచానికి నాయకత్వం వహించే విశ్వగురుగా చెప్పుకునే పార్టీ ఇలా బాహాటంగా మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడడం ప్రపంచం గమనిస్తోంది.

వ్యతిరేకతను, అసమ్మతిని, విమర్శలను ఏ మాత్రం భరించలేని పార్టీగా, అధికారం కాపాడుకోవడం కోసం ఏం చేయడానికైనా సిద్ధపడే పార్టీగా ఈ చర్యలతో ప్రపంచానికి తనను తాను పరిచయం చేసుకుంది. కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయించడం, భావప్రకటనా స్వేచ్ఛను తొక్కేయడం, న్యాయవ్యవస్థ స్వేచ్ఛ స్వతంత్రాలను హరించే ప్రయత్నాలు గమనిస్తే బీజేపీ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోడానికి ప్రజాస్వామిక విలువలను తుంగల్లో తొక్కి, నిరంకుశ నియంతృత్వ పోకడలు పోతుందన్నది స్పష్టం.

భారత ప్రజాస్వామ్యానికి పునాదులైన మానవ హక్కులు, పత్రికా స్వతంత్రం, లౌకిక సూత్రాలను కాలరాసే చర్యలు తీసుకుంటూ, ఈ చర్యలను కప్పి పుచ్చుకోడానికి విశ్వగురు వంటి మాటలు చెబుతున్నారనిపిస్తుంది. భారతదేశానికి పాత వైభవం మళ్ళీ సాధించామని, ప్రాచీన జ్ఞాన విజ్ఞానాల ప్రకాశాన్ని మళ్ళీ పునరుద్ధరించామని, ప్రపంచానికి నాయకత్వం వహించే శక్తి సామర్థ్యాలు చాటి చెప్పామని మోడీ, ఆయన పార్టీ బీజేపీ చెప్పే మాటలు కేవలం చునావీ జుమ్లాలుగా కనిపిస్తున్నాయి. విశ్వజనీన మానవ హక్కులపై బీజేపీ దాడులను ఇప్పుడు అమెరికా వంటి అతి సన్నిహిత మిత్రదేశం కూడా వేలెత్తి చూపిస్తోంది.


శాంతియుత పరస్పర సహజీవనం, సామరస్యాలను మంటగలిపి, విద్వేష రాజకీయాలను నడిపి బీజేపీ భారత సామాజిక నిర్మాణాన్ని చాలా వరకు ధ్వంసం చేసింది. భారతదేశం ప్రపంచంలో ఇంతవరకు సంపాదించుకున్న గౌరవ మర్యాదలను, పలుకుబడిని దెబ్బ తీసింది. మానవ హక్కుల ఉల్లంఘన, అసమ్మతిని అణిచేయడం, జాతీయ సంస్థల స్వేచ్ఛా స్వాతంత్రాలను హరించి వేయడం వంటి చర్యలు విశ్వగురువు చేసే పనులా? అంతర్జాతీయంగా సరయిన గుర్తింపు పొందాలంటే ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, బహుళత్వం వంటి రాజ్యాంగ విలువలకు కట్టుబడినప్పుడే సాధ్యమవుతుంది. ❖



# ఇస్లాం యుగపురుషుడు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్

**పూసపాటి వేదాద్రి, కవి, సాహితీ విశ్లేషకులు**

**సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్** భారతీయ విద్యావేత్త, రాజకీయ నాయకుడు, ఇస్లామీయ సామాజిక సంస్కర్త, నవీన భావాలు కలిగిన మహనీయుడు. ముస్లిం విద్యా ప్రాధాన్యతను తెలియజేసి భారత దేశంలో ముస్లింల విద్యాభివృద్ధికి అలీఘర్ విశ్వవిద్యాలయం ద్వారా కృషి చేసిన మహనీయుడు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్. ప్రముఖ సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా, తత్తవేత్తగా, ఆధునిక విద్య పాశ్చాత్య శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ముస్లిం సమాజాన్ని అభివృద్ధి చేయటానికి కృషి చేసిన మహనీయుడు. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ 1817లో ఢిల్లీలో జన్మించారు. తండ్రి ఖుర్షీద్ జాహ్ బహదూర్, ఢిల్లీలో ఈస్ట్ ఇండియా కంపెనీకి కోర్టులో పనిచేసేవారు. ఆయనకు చిన్నప్పటి నుంచే  మంచి విద్య లభించింది. సంప్రదాయ విద్యతో పాటు ఆంగ్ల విద్యలో కూడా నైపుణ్యం సాధించారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీలో పనిచేసి, 1857 తిరుగుబాటు తర్వాత ముస్లింల పరిస్థితిని మెరుగుపరచడానికి కృషి చేశారు. 1838లో తండ్రి మరణంతో, ఆయన 21 ఏళ్ళ వయసులో కుటుంబ బాధ్యతలు స్వీకరించారు. 1857 తిరుగుబాటు తరువాత, ముస్లిం సమాజం పరిస్థితిని చూసి చలించిపోయారు. ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా పురోగతికి కృషి చేయాలని నిర్ణయించు కున్నారు. సాంఘిక సంస్కర్తగా, ముస్లిం మహిళలకు విద్యను అందించడానికి కృషి చేశారు. ముస్లింలలో హేతుబద్ధ ఆలోచనను ప్రోత్సహించారు. సామాజిక ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించడానికి కృషి చేశారు. హిందువులు, ముస్లింల మధ్య ఐక్యతను పెంపొందించడానికి కృషి చేశారు. 1859లో మొరదాబాద్‌లో పాఠశాలను స్థాపించారు. 1863 ఘాజీపూర్‌లో శాస్త్రీయ సొసైటీని స్థాపించారు. 1864లో ముస్లిం విద్యా అభివృద్ధి కోసం "మదర్సతుల్ ఉలూమ్" స్థాపించారు. 1875లో అలీగఢ్‌లో ముహమ్మదన్ ఆంగ్లో–ఓరియంటల్ కళాశాల (ప్రస్తుతం అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం) స్థాపించారు. ఆధునిక విద్యను ముస్లింలకు అందించడానికి ఈ కళాశాలను ఒక కేంద్రంగా మార్చారు. పాశ్చాత్య  శాస్త్రాలు, సాంకేతికతలను ముస్లింలు అభ్యసించాలని ప్రోత్సహించారు. ముస్లింలు ఖురాన్‌లోని సూక్తులను ఆధునిక సందర్భాలకు అనుగుణంగా అర్థం చేసుకో వాలని భావించారు. హేతుబద్ధ ఆలోచన, విజ్ఞానంతో మత విశ్వాసా లను సమన్వయం చేయాలని వాదించారు. భారతదేశంలోని అన్ని మతాల ప్రజల మధ్య ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించడానికి కృషి చేశారు. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ తహ్‌జీబుల్ అఖ్లాఖ్ (నైతిక సంస్కరణలు) పత్రికను ప్రారంభించి, సామాజిక సంస్కరణలకు పిలుపునిచ్చారు. ఆధునిక భారత ముస్లిం సామాజిక పితామహునిగా సయ్యద్ అనే బిరుదుతో పాటు బ్రిటిష్ ప్రభుత్వం నుండి 'సర్'బిరుదు కూడా పొందారు. రాజకీయ నాయకుడిగా బ్రిటిష్ పాలనలో ముస్లింలకు రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాటం చేశారు. భారత జాతీయ కాంగ్రెస్‌కు సహకరించి, హిందూ–ముస్లిం ఐక్యతకు కృషి చేశారు. ఈయన స్థాపించిన అలీఘర్ యూనివర్సిటీలో ప్రస్తుతం 280 కోర్సులు, 12 ప్రధాన విభాగాలు ఉన్నాయి. వ్యవసాయం, కళల విభాగం, వాణిజ్యం, ఇంజనీరింగ్, సాంకేతిక న్యాయ విభాగం, జీవశాస్త్ర విభాగం, మేనేజ్మెంట్ విభాగం ఇలా వైవిద్య భరితమైన అనేక సామాజిక అంశాలలో వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు. భారతదేశంలో ప్రముఖులు రాజమహేంద్ర ప్రతాప్ సింగ్, దివంగత డాక్టర్ జాకిర్ హుస్సేన్, ముహమ్మద్  హామిద్ అన్సారీ మాజీ ఉపరాష్ట్రపతి, ఈశ్వర్ ప్రసాద్ ప్రముఖ చరిత్రకారుడు, షేక్ అబ్దుల్లా జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, ముహమ్మద్ యూనుస్ భారత దౌత్యవేత్త స్పెయిన్ టర్కి ఇండోనేషియా రాయబారి, జావేద్ అక్తర్ ప్రముఖ కవి, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ సరిహద్దు గాంధీ, ధ్యాన్ చంద్ ప్రముఖ భారతీయ హాకీ క్రీడాకారుడు– ఇలా చరిత్రకారులు కవులు రచయితలు రాజకీయ మేధావులు ఎందరో అలీఘర్ యూనివర్సిటీ నుంచి విద్యనభ్యసించి భారతదేశంలో ప్రముఖులుగా వెలుగులోకి వచ్చారంటే అందుకు గల కారణం సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్. ఇస్లాం యుగపురుషుడు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ 1898 మార్చి 17న మరణించినప్పటికీ ఆయన ఆశయ సాధనలో అలీఘర్ యూనివర్సిటీ ఇప్పటికీ కృషి చేయటం గమనార్హం. ❖




# చీమ

- వాహెద్

**అట్టడుగు స్థాయి నుంచి పైకెదగాలంటే ఎంత కష్టపడాలి?**

తనకన్నా బరువును మోసుకుని గోడలపైకెగబ్రాకే చీమ కన్నా ఎక్కువ కష్టపడాలి.

నేను ప్రయిమరి క్లాసుల్లో ఉన్నప్పుడు... చదివింది ప్రభుత్వ పాఠశాలే లెండి.

స్కూలు కెళ్ళాలంటే గుండెల్లో కాస్త దమ్ముండాలి. కళ్ళ ముందు కనబడే పేం బెత్తాన్ని విదిల్చి కొట్టి ధైర్యంగా సంచి మెళ్ళో వేసుకోవాలి. కాళ్ళకు చెప్పులక్కర్లేదు. అవి ఎలాగూ ఉండవు.

మాస్టార్లు హోం వర్కులు ఇస్తారు. అదేం చిత్రమో, తేలికైన లెక్కలన్నీ క్లాసులో చేయించి, కాషాయంలా గొంతు దిగని, మింగుడు పడని, ఎంత తన్నుకు చచ్చినా జవాబు తేలని లెక్కలే హోంవర్కుకు ఇస్తారు. ఇంగ్లీషు మరో గండం. మొదటి బరికి మూడవ బరికి మధ్య తేడా ఏంటో పుటం పెట్టినా అర్థం కాదు. ముత్యాల్లా రాసుకురండ్రా కాపీ రైటింగు. ఆర్డరేసే మాస్టారుకేం తెలుసు ముత్యాలెలా ఉంటాయో మేమెప్పుడు చూసి చావలేదని.

మర్నాడు హోంవర్కు చేయలేదా... పేం బెత్తం భలే సరదాగా తలూపుతుంది...రా..రా...అని పిలుస్తుంది...రేయ్..హోంవర్కు చేయలేదా? ఊం.. వెనక్కి తిరుగు...

ఇలాంటి ప్రమాదాలు ముందే ఊహించి వేసుకున్న నాలుగైదు చెడ్డీలు కూడా పేం బెత్తం దెబ్బ కాచుకోడానికి పనికిరావు.

చేయి పట్రా అని అరిచేయి మంటపుట్టేలా కొట్టి ఆనందించే మాస్టారొకడైతే, చేయి వెనక్కి తిప్పరా అని అరిచేయి వెనక విరిగేలా కొట్టే వాడు మరొకడు.

చదువుకోవడం, బడికి వెళ్ళడం... గుండెధైర్యంతో చేసే పనులు...

కానీ...కొందరికి అవి చాలా తేలిక...కొందరికి కాస్త పర్వాలేదు...

అప్పటికీ మా ఇంట్లో ఒక బాబాయి గ్రాడ్యుయేటు. అందులోను లెక్కలు చదివాడు. మరో బాబాయి చదువుకుంటున్నాడు. హోం వర్కంటూ మా మాస్టారిచ్చే తలతిక్క లెక్కలన్నీ బాబాయిల్లో ఎవరో ఒకరు నాకు హెల్ప్ సాయం చేసి పెడతారు.

నాకు బాగా గుర్తుంది... వేసవిలో ఆరుబయట నిద్రపోయేవాళ్ళం. మడత మంచంపై వెల్లకిలా పడుకుని నాలో నేను "నా కైతే పర్వాలేదు. ఈ లెక్కల హోంవర్కు, ఈ ఇంగ్లీషు గొడవ చెప్పడానికి బాబాయిలున్నారు". అలా అనుకుంటే ఎంతో హాయిగా ఉండేది. హమ్మయ్య అనిపించేది. నా బద్ధకం కొద్దీ హోంవర్కు చేయకపోతే తప్ప పేం బెత్తం మన జోలికి రాదు అన్న భరోసా ఉండేది.

అప్పుడప్పుడు అనుకునే వాడిని "పాపం ముచ్చు గాడికి ఎలా? వాళ్ళ నాన్నకు చదువురాదు. ఇంట్లో వాడికి చెప్పేవాళ్ళెవరూ లేరు. నాన్నేమో పాలేరు. అమ్మ కూలికి వెళుతుంది. పాపం వాడికి చెడ్డీలు కూడా ఎక్కువ లేవు. చిరిగిన చెడ్డీ ఒక్కటే వేసుకు

వస్తాడు. పేం బెత్తం దెబ్బను ఒక్క చెడ్డీతో తట్టుకోవడం...వార్నాయనో".

దెబ్బలకు దెబ్బలు... దెబ్బల తర్వాత చావుదెబ్బ కొట్టే మాటలు... నీ కెందుకురా చదువు, మీ బాబు చదివాడా? మీ తాత చదివాడా? చదువుకోవాలని లేకపోతే పోయి మట్టి పిసుక్కు బతుకు పోరా...

(ఈ మాటల్లో వివక్ష ఉందో లేక చదివేలా ప్రోత్సహించడానికి చెప్పినవో నాకు తెలియదు)

అయినా వాడికి చాలా గుండె ధైర్యం ఉండేది. వాడు పేం బెత్తానికి భయపడకుండా స్కూలుకు వచ్చేవాడు. వాడు దేనికి భయపడే రకం కాదు. ఒక్కుదుటున కొబ్బరి చెట్టుపై ఎగబాకేవాడు. కళ్ళు మూసి తెరిచేలోగా బోండాలు కిందికి పడేసేవాడు. పంగలకర్రతో గురిచూసి కొడితే తాటితోపులో ముంజెలు నేలకు రాలవలసిందే. పంగలకర్రేంటి వాడికి వడిసెల విసరడం కూడా వచ్చు. వాడు నిజంగా విద్యలు నేర్చినవాడు. వాడు నడుస్తుంటే వాడి వెనక పరిగెత్తాల్సి వచ్చేది. కబడ్డీలో వాడు కూతకు వస్తే మాకు భయమే. చూడ్డానికి సన్నగా రివటలా ఉండేవాడు. తిండానికి ఇంట్లో ఏముంటుందని, పచ్చిమిరప, ఉల్లి గంజిలో నంజుకోవడమే. అయినా వాడి బలం ముందు మేం దిగదుడుపే. అందుకే వాడు పేం బెత్తానికి భయపడలేదు. నీ బొంద నువ్వేం చేస్తావ్ లే అన్నట్లు హోంవర్కు చేయకపోయినా వచ్చేవాడు (వాడెలాగూ చేయలేడు. చేయించే వాళ్ళెవరు ఇంట్లో లేరు).

అప్పుడప్పుడు వాడితో గొడవలు పడేవాడిని, అప్పుడనుకునేవాడిని "రేపు ఈడెలాగూ లెక్కల హోంవర్కు చేయులేడు నా సామిరంగా అప్పుడుంటుందిలే నీకు..."

సరిగా ప్రపంచం తెలియనితనంలో అలా అనుకున్న మాటలు ఇప్పుడు ప్రపంచాన్ని చూసిన తర్వాత ముల్లుల్లా గుచ్చుకుంటున్నాయి.

ఒక చీమలా తనకన్నా బరువును మోసుకుని గోడపైకి ఎగబాకే ప్రయత్నం చేస్తున్న అనేకమంది రోహితులే కనిపిస్తున్నారు.

ఇంతకీ రోహిత్ ఎవరో ఎవరికైనా గుర్తున్నాడా?

**ఒక అరబ్బుకు అరబ్బేతరునిపై గాని, అరబ్బేతరునికి అరబ్బుపై గాని మహత్తు లేదు, నల్లవానికి తెల్లవానిపై గాని తెల్లవానికి నల్లవానిపై గాని ఆధిక్యత లేదు. భయభక్తుల ఆధారంగానే గొప్పదనం. మీరంతా ఆదమ్ సంతానం, ఆదమ్ మట్టితో సృజించబడ్డారు.- ముహమ్మద్ ప్రవక్త (సఅసం)**


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.**


బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
**A/c. No. 1042789768**
**IFSC Code. CBIN0282407**

**లేదా**

**పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.**

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




ఉమైర్

# మతతత్వానికి, మందిస్వామ్యానికి పెద్దపీట వేస్తున్న నేటి సినిమా

**సినిమా** చాలా బలమైన మీడియా. ప్రజాభిప్రాయాన్ని మలచడానికి గొప్ప సాధనం సినిమా. కొన్ని దశాబ్దాల క్రితం వరకు సామాజిక వాస్తవాలను చిత్రీకరించడం, ప్రగతిశీల ఆలోచనలను ప్రోత్సహించడం సినిమాల్లో ఉండేది. మదర్ ఇండియా, దో బీఘా జమీన్, నయా దౌర్ వంటి హిందీ సినిమాలు ఈ కోవకు చెందినవే. బయోపిక్స్‌గా అటెన్ బరో తీసిన గాంధీ వంటి సినిమాలు వచ్చాయి. భగత్‌సింగ్ జీవితంపై సినిమా వచ్చింది. ఇవన్నీ సమాజంలో విలువలను ప్రోత్సహించే సినిమాలు.

కాని ఇప్పుడు పరిస్థితి మారింది. మెజారిటేరియనిజం, మూక స్వామ్యం, విభజన రాజకీయాలు ఇప్పుడు పెరిగిపోయాయి. హిందూ రాష్ట్ర నినాదాలు మారుమోగుతున్నాయి. ఈ వాతావరణంలో సినిమా హిట్టవ్వాలంటే, డబ్బుల వాన కురవా లంటే విభజన భావాలను ప్రచారం చేసే, మతతత్వం సందేశంతో, చరిత్రను వక్రీకరించి, విద్వేష భావాల సినిమాలు తీయడం లాభసాటిగా భావించడం ప్రారంభమయ్యింది. నిజాలను సమాధి చేసి, కల్పనలను వాస్తవాలుగా చూపించడం మొదలయ్యింది. ఇలాంటి సినిమాల్లో కశ్మీర్ ఫైల్స్ ఒకటి. ఈ సినిమాను స్వయంగా ప్రధాని మోడీ గొప్పగా ప్రచారం చేశారు. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగత్ ప్రచారం చేశారు. బీజేపీ నేతలు ఈ సినిమా టిక్కెట్లు కొని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు పంచిపెట్టి సినిమా చూడండన్నారు. కశ్మీర్ ఫైల్స్ సినిమాపై వచ్చిన విమర్శలు చదివితే ఈ సినిమా ఎలాంటి ప్రాపగాండ సినిమానో అర్థం అవుతుంది. మరో ఉదాహరణ కేరళ స్టోరీ. ఈ సినిమాలో ఐసిస్‌లో చేరిన భారతీయ అమ్మాయిల సంఖ్య అంటూ అబద్ధాలు ప్రచారం చేశారు. 72 హూరేం వంటి ఇలాంటి కొన్ని సినిమాలు, ఇస్లాం పై బురదజల్లే సినిమాలు, ఇస్లామిక్ టెర్రరిజం అంటూ రాజకీయ ప్రచారం చేసే సినిమాలు కొన్ని బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టాయి.

ఈ సినిమాల ముఖ్య లక్ష్యం ఇస్లామోఫోబియా పెంచడం. మరోవైపు గాడ్సే 2022 సినిమా గాంధీజీ హంతకుడిని చాలా గొప్పవాడిగా కీర్తించడానికి తీసిన సినిమా. అందుకోసం నిర్లజ్జగా ఈ సినిమాలో అబద్ధాలు చెప్పారు. ఉదాహరణకు భగత్ సింగ్‌ను కాపాడ్డానికి గాంధీ ఎన్నడూ ప్రయత్నించలేదని చెప్పడం. భగత్

సింగ్ ఉరితీయబడినప్పుడు విషాదాన్ని ప్రకటిస్తూ కాంగ్రెస్ తీర్మానం చేయడాన్ని గాంధీ అడ్డుకున్నారని చెప్పడం. ఇవన్నీ అబద్దాలు. ఇలాంటి అబద్దాలతో గాంధీ హంతకుడిని గొప్పవాడిగా కీర్తించే ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఇలాంటి మరో సినిమా వచ్చింది. దాని పేరు స్వతంత్రవీర్ సావర్కర్. ఇందులో పచ్చి అబద్దాలను నిజాలుగా నమ్మించడానికి ప్రయత్నించారు. ఈ సినిమా ప్రకారం భగత్ సింగ్ సావార్కర్‌ను కలవడానికి వెళ్ళాడట, సావర్కర్ రాసిన మొదటి స్వతంత్ర పోరాటం పుస్తకాన్ని మరాఠి నుంచి ఇంగ్లీషులోకి అనువదిస్తానని చెప్పాడట.

నిజమేమిటి? చాలా మంది ఈ పుస్తకాన్ని చదివారు. ఈ పుస్తకం 1908 ప్రాంతంలో రాయబడింది. ఆ తర్వాతి సంవత్సరమే ఆ పుస్తకం ఇంగ్లీషు అనువాదం కూడా వచ్చింది. భగత్ సింగ్ పుట్టింది 1907లో. నిజానికి తన జీవితంలో భగత్‌సింగ్ ఎన్నడూ సావర్కర్‌ను కలవలేదు. ఇలాంటి అబద్దాలను చరిత్రగా వండేస్తున్నారు ఈ సినిమాల్లో.

ఈ సినిమాలో సావర్కర్ ఏమంటాడంటే, 1912 నాటికి మనం స్వాతంత్ర్యం సంపాదించుకోవాలంటాడు. కాని చరిత్రను చూస్తే, సావర్కర్ 1910లో అండమాన్ జైలులో ఉన్నాడు. అప్పటి నుంచి క్షమాపణ లేఖలు బ్రిటీషువాళ్ళకు రాయడం ప్రారంభించాడు. 1912 వరకు మూడు క్షమాపణ లేఖలు రాశాడు. ఈ లేఖల్లో బ్రిటీషు వారికి క్షమాపణలు కోరడమే కాదు, తనను విడుదల చేస్తే బ్రిటీషు వారికి విధేయుడిగా సేవలు చేస్తానని కూడా రాశాడు. ఆ తర్వాత బ్రిటీషు వారు విడుదల చేసిన తర్వాత సావర్కర్ చేసింది కూడా అదే. స్వతంత్ర పోరాటానికి చాలా దూరంగా ఉన్నాడు. 1920లో సహాయనిరాకరణ ఉద్యమం తీవ్రమై, స్వతంత్రపోరాటం ఉధృతంగా జరుగుతున్నప్పుడు అస్సలు ఆ చుట్టుపక్కల సావర్కర్ కనిపించలేదు.

ఈ సినిమా ప్రకారం భారతదేశానికి అహింసాయుత పోరాటం వల్ల స్వతంత్రం లభించలేదు. హింసాత్మక సాయుధ పోరాటం వల్ల లభించింది. కాని చారిత్రక వాస్తవాలెలా ఉన్నాయో అది కూడా చూద్దాం. అప్పట్లో దేశస్వతంత్రం కోసం సాయుధపోరాట మార్గంలో నడుస్తున్న వాళ్ళు హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియషన్. భగత్ సింగ్ ఆయన మిత్రులు ఉరికంబం ఎక్కిన తర్వాత మరో పెద్ద సాయుధ పోరాట ఉద్యమం ఏది వెంటనే ఏర్పడలేదు. సావర్కర్ బ్రిటీషువారికి క్షమాభిక్షపత్రాలు రాయడం ప్రారంభించిన తర్వాత సావర్కర్ సారథ్యంలోని అభినవ భారత్ సంస్థ బ్రిటీషు వారిపై పోరటమే చేయలేదు. ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి పోరాడిన సుభాష్ చంద్రబోస్ 1945లో మరణించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ లోని సైనికులను పట్టుకని ఎర్రకోటలో నిర్బంధించారు. నెహ్రూ ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులను కాపాడ్డానికి ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ యుద్ధ ఖైదీల కోసం కాంగ్రెసు రంగంలోకి దిగింది.

ఈ సినిమా ప్రకారం బ్రిటీషువారిపై పోరాడ్డానికి ఒక సైన్యం ఏర్పాటు చేయాలని బోస్‌కు సలహా ఇచ్చింది కూడా సావర్కరేనట. చరిత్రను పరిశీలిస్తే, కాంగ్రెసును వదిలి సాయుధ పంథా స్వీకరించిన బోస్ జర్మనీ, జపాన్‌ల సహాయంతో బ్రిటీషు వారిని ఓడించాలనుకున్నాడు. బోస్ బ్రిటీషువారిపై పోరాడుతున్నప్పుడు సావర్కర్ హిందూ మహాసభ సహాయంతో బ్రిటీషు సైన్యంలో హిందువులను రిక్రూట్ చేస్తూ, బ్రిటీషు వారికి సహాయపడుతూ ఉన్నాడు. అందుకే ఈ సినిమా చూసిన తర్వాత నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనుమడు చంద్రకుమార్ బోస్ ఏమన్నాడంటే, సుభాష్ చంద్రబోస్ గొప్ప దేశభక్తుడు, నేతాజీకి సావర్కర్‌తో లింకు పెట్టే ప్రయత్నాలు చేయవద్దని సినిమా తీసిన వారికి నిర్మొహమాటంగా చెప్పాడు.


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# చరిత్ర సాక్షిగా మార్చి 31, ఓ విప్లవ దినం

కవి కరీముల్లా

హిజ్రీ 8వ శకం, రంజాన్‌నెల 20వ తేది, అనగా మార్చి 31 చరిత్రలో ఓ మరుపురాని ఘట్టాన్ని ఆవిష్కరించిన తేది. మానవ మహోపకారి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) తన పది వేల మంది అనుచరులతో మక్కాకు బయలుదేరారు. తను పుట్టి పెరిగిన నేల. సంవత్సరాల తరబడి ప్రవక్తను భౌతికంగా, మానసికంగా హింసించిన ప్రజలు. పది వేల మంది ఆయన సహచరులను ఎదుర్కొనే ధైర్యం లేక నిస్సహాయంగా ప్రవక్త రాకను వీక్షిస్తున్న సందర్భం. మానవులంతా ఒక్కటే, అందరి దేవుడు ఒక్కడే, ఆయన జనన మరణాలకు అతీతుడు. ఆయనను పోల్చదగిన ఏ మనిషి, ఏ ప్రాణి, ఏ వస్తువు ఈ భూమండలంపై లేదు అని బోధించినందుకు ఒంటె ప్రేగుల్ని తెచ్చి ఆయన నమాజ్ చేసుకుంటున్నప్పుడు మెడకు చుట్టి లాగిన పాషండులు నక్కి నక్కి చూస్తున్న దృశ్యం. మనుషుల్లో పుట్టుక రీత్యా ఎవరూ గొప్పవాడు, తక్కువ వాడు కాదు అని, నల్ల జాతి వారిని బానిసత్వం నుండి విముక్తి చేయమని ప్రవక్త చెప్పినందుకు అగ్రవర్ణ అరబ్బు దురహంకారంతో రాళ్లతో పైశాచికంగా దాడి చేసిన క్రూరులు ప్రవక్త తమపై ప్రతీకారం తీర్చుకుంటారేమోనని బిక్కు బిక్కుమంటూ గడుపుతున్న సమయమది. ఆడపిల్లల్ని చంపడం తప్పు, ధర్మం ప్రకారం పురుషులకు గల అన్ని హక్కులు మహిళలకూ ఉన్నాయని, స్త్రీని గౌరవించండి అని చెప్పినందుకు ప్రవక్తను నానా దుర్భాషలాడి అనుక్షణం పరిహసించిన నీచులు ఇప్పుడు గజగజా వణుకుతున్న క్షణమది. సంవత్సరాల తరబడి ప్రవక్తను, ఆయన సహచరులను బహిష్కరించి అన్నపానీయాలు అందకుండా చేసి ఎంతో మందిని బలిగొన్న దుర్మార్గులు ఇక తమ పని అయిపోయింది అని భావించి భీతితో చూస్తున్న రోజిది... ప్రవక్త బాబాయి హజ్రత్ హంజా (ర) పొట్ట చీల్చి కాలేయాన్ని నమిలి మింగిన కఠినాత్ములు బెదురు బెదురుగా దాక్కున్న గంటలవి.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా సరిహద్దుల వద్ద నిలబడి ప్రశాంత వదనంతో తను పుట్టి పెరిగిన ఆ నేల వైపు తదేకంగా చూశారు. తన సహచరుల వైపుకు తిరిగి ఓ నా సహచరులారా అహంభావంతో, విజయగర్వంతో గాక వినయంతో, అణుకువతో మక్కాలో ప్రవేశించండి, పాత గాయాలను మర్చిపొండి అని చెప్పి మక్కాలో ప్రవేశించారు. వస్తూనే బిగ్గరగా ఓ మక్కా వాసులారా మీపై ఎటువంటి ప్రతీకారం లేదు. నిర్భయంగా, నిశ్చయంగా ఉండండి. అల్లాహ్ అనంత కరుణామయుడు. మాపై జరిగిన ఏ హింసకూ ప్రతీకారం లేదు అని పలకగానే యావత్తు మక్కా ప్రజలు నిశ్చేష్టులైనారు. ప్రతీకార న్యాయం అరబ్బులకు చాలా సహజం కదా! అయినా ప్రవక్త మనల్ని క్షమించడమేమిటి? అని విస్తుపోయారు. వారి కన్నులు అశ్రుపూరితాలయ్యాయి. ఇంత దయామయుడైన ప్రవక్తనా తాము హింసించింది అని పశ్చాత్తాపంతో తల్లడిల్లిపోయారు. ప్రవక్త కాబా చెంత చేరి కాబాను తన స్వహస్తాలతో పరిశుద్ధం చేశారు. "సత్యం వచ్చేసింది. అసత్యం నిష్క్రమించింది. అసత్యమైతే ఎప్పటికైనా నిష్క్రమించవల్సిందే"...

ప్రవక్త ముహమ్మద్ (స) తన సహచరులు వైపుకు తిరిగారు హజ్రత్ బిలాల్‌ను తన వైపుకు రమ్మన్నారు. జీవితంలో నల్లజాతి బానిసగా అరబ్బు అగ్రవర్ణ దురహంకారుల చేతుల్లో హింసింపబడి ప్రవక్త బోధనలతో ఆకర్షితుడై ప్రవక్త చేతుల మీదుగా ఇస్లాం స్వీకరించి ప్రవక్తకు సైదోడుగా నిల్చిన బిలాల్ ఆర్ద్రమైన కన్నులతో ప్రవక్త వంక చూస్తున్నారు. బిలాల్ పవిత్రమైన ఈ కాబాపై ఎక్కి కాబాలో తొలి అజాన్ ఇవ్వు అని కోరగానే బిలాల్ కళ్లు ఉద్వేగంతో అశ్రుపూరితాలయ్యాయి. ఏ మక్కాలో అయితే తనను జాతి పేరుతో హింసించారో, బానిసగా చూశారో అలాంటి మక్కాలో, అందునా పవిత్రమైన కాబా గృహం పైకెక్కి అజాన్ ఇవ్వమనటంతో బిలాల్ ఆనందాశ్రువులతో తాడు సహాయంతో కాబా పైకెక్కి "అల్లాహొ అక్బర్, అల్లాహొ అక్బర్ (అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు) అని అజాన్ ఇస్తుంటే మక్కా మొత్తం విస్తుపోయింది. ఒక నల్లజాతి బానిసకు పవిత్రమైన కాబా పై కప్పుపై ఎక్కి తొలి అజాన్ ఇచ్చే సౌభాగ్యమా! ఇంత పెద్ద స్థానమా? ఇంతమంది అరబ్బులుండగా ప్రవక్త ఆయనకు అవకాశం కల్పించడమేంటి? పుట్టుక రీత్యా ఎవరూ అధికులూ కాదు, అల్పులూ కాదు. మానవులంతా సమానులే. వంశాల, గోత్రాల, వర్ణాల ఘనతల్ని రద్దు చేసింది ఇస్లాం. చరిత్ర సాక్షిగా ప్రవక్త ప్రేమకు,కరుణకు తలవంచి మొత్తం మక్కా అనతికాలంలోనే ఇస్లాం స్వీకరించింది. హజ్రత్ బిలాల్ (రజిఅన్) గొంతు అజాన్ రూపంలో అల్లాహొ అక్బర్, అల్లాహొ అక్బర్ (అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు) అని మక్కాలో ప్రతిధ్వనించింది. హయ్యాలస్సలాహ్, హయ్యాలస్సలాహ్ (మీరు సన్మార్గం వైపుకు రండి, మీరు సన్మార్గం వైపుకు రండి) హయ్యాలల్ఫలాహ్, హయ్యాలల్ఫలాహ్ (మీరు సాఫల్యం వైపుకు రండి.మీరు సాఫల్యం వైపుకు రండి) అని ఇచ్చిన పిలుపు అందర్నీ కదిలించింది. హజ్రత్ బిలాల్ (రజి) గొంతు నుండి తొలినాళ్ళలో మదీనాలో మొదలైన ఈ అజాన్ అప్పటి నుండి ఇప్పటివరకూ కోటానుకోట్ల గొంతుల నుండి విస్తరించి సూర్యుని వెలుతురు ప్రసరించే ప్రతి చోట, ప్రతిక్షణం భూమండలం నిండా ధ్వనిస్తూనే ఉంది. మొత్తం ప్రపంచం వింటూనే ఉంది.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**